RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | శుక్రవారం, మే 8, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 29 | పేజీలు: 8 | వెల : రూ.1

ఇతర వాహనాలకు
ఇబ్బంది లేకుండా, సాధారణ ట్రాఫిక్‌లో
రేవంత్ కాన్వాయ్ ప్రయాణం

తెలంగాణ వ్యాప్తంగా హైడ్రా విస్తరణకు ప్రభుత్వం నిర్ణయం

హైదరాబాద్, మే 7 : తెలంగాణ అంతటా హైడ్రాను విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా హైడ్రాకు వినతులు వస్తున్నాయని.. ఈ నేపథ్యంలో హైడ్రా పరిధిని రాష్ట్రమంతటా విస్తరించాలని నిర్ణయించినట్లు వివరించారు. గురువారం నల్గొండ జిల్లాలో పర్యటించిన హైడ్రా కమిషనర్.. ఈ విషయాన్ని వెల్లడించారు. ఇప్పటి వరకూ కోట్ల విలువైన భూములను కబ్జాదారుల చెర నుంచి హైడ్రా కాపాడినట్లు వివరించారు రాష్ట్రవ్యాప్తంగా హైడ్రాను విస్తరించాలని.. తెలంగాణ సర్కారు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వయంగా వెల్లడించారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడలో రంగనాథ్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడిన ఆయన.. రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా సేవలు విస్తరించాలంటూ ప్రజల నుంచి వినతులు ఎక్కువగా వస్తున్నాయని రంగనాథ్ అన్నారు. ఈ నేపథ్యంలో హైడ్రాను రాష్ట్రమంతా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. హైడ్రాకు కబ్జాలపై వేలాదిగా ఫిర్యాదులు వస్తున్నాయని.. ఆ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ క్రమంలోనే నాలుగు వారాలు ప్రజావాణిని

(మిగతా 2వ పేజీలో)

విజయ్‌కు గవర్నర్ షాక్..

మ్యాజిక్ ఫిగర్ చూపిస్తేనే ప్రమాణం.. అధికారికంగా ప్రకటించిన గవర్నర్

చెన్నై, మే 7 : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత రాజకీయాలు క్లైమాక్స్‌కు చేరుకున్నాయి. దళప విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, అధికార పీఠం దక్కించుకోవడం ఇప్పట్లో సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. ప్రభుత్వ ఏర్పాటుకు తగిన మెజార్టీ లేని కారణంగా విజయ్‌ను ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించలేదని లోక్ భవన్ అధికారికంగా ప్రకటించింది. గురువారం గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్, విజయ్ మధ్య జరిగిన రెండో విడత భేటీ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశం అనంతరం రాజ్ భవన్ ప్రకటన విడుదల చేసింది. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 118 మంది ఎమ్మెల్యేల మద్దతు విజయ్ వద్ద లేదు. కేవలం అతిపెద్ద పార్టీగా ఉన్నంత మాత్రాన ప్రభుత్వం ఏర్పాటుకు పిలవలేమని, రాజ్యాంగ నిబంధనల ప్రకారం మెజార్టీ సభ్యుల సంతకాలతో కూడిన మద్దతు లేఖలు సమర్పించాలని గవర్నర్ స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాల ప్రకారం విజయ్ పార్టీ టీవీకే 108 స్థానాలు సాధించింది. కాంగ్రెస్ తన 5 సీట్ల మద్దతును ప్రకటించడంతో ఈ సంఖ్య 113 కి చేరింది. విజయ్ రెండు చోట్ల గెలిచినందున, ఒక సీటుకు రాజీనామా చేయాల్సి ఉంటుంది. అప్పుడు టీవీకే బలం 107 కి తగ్గుతుంది. కాంగ్రెస్‌తో కలిపి కూటమి బలం 112 వద్దే ఆగిపోతుంది. అధికారం దక్కించుకోవడానికి విజయ్‌కు ఇంకా 6 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. ఈ అదనపు మద్దతు లేఖలు లేకపోవడంతోనే గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. గవర్నర్ నిర్ణయంపై టీవీకే మద్దతుదారులతో పాటు

(మిగతా 2వ పేజీలో)

ఆపరేషన్ సిందూర్' భారత శౌర్యానికి నిదర్శనం

ఉగ్రవాదానికి ఆశ్రయం ఇచ్చే శక్తులకు ఇది గట్టి హెచ్చరిక

బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

హైదరాబాద్ మే7: 'ఆపరేషన్ సిందూర్' భారత శౌర్యానికి నిదర్శనమని, ఉగ్రవాదానికి ఆశ్రయం ఇచ్చే శక్తులకు ఇది గట్టి హెచ్చరిక అని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. పాకిస్థాన్ మరియు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేస్తూ భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా, నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా సంబురాలు నిర్వహించారు. బిజెపి రిటైర్డ్ ఆర్మీ సెల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని,

(మిగతా 2వ పేజీలో)

జూన్ 8న హైదరాబాద్‌లో చేప ప్రసాదం పంపిణీ

కేటీఆర్ క్రిమినల్ కేసు

హైదరాబాద్, మే 7 బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై వరంగల్‌లో క్రిమినల్ కేసులు నమోదు కావడం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఉత్కంఠ రేపుతోంది. హన్మకొండ 'రైతు సంగ్రామ సదస్సు' వేదికగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చట్టపరమైన చిక్కులకు దారితీశాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలను ఉద్దేశించి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు అనుచితంగా ఉన్నాయని కాంగ్రెస్ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి తదితరుల ఫిర్యాదు మేరకు సుబేదారి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు కేటీఆర్‌పై బీఎన్ఎస్ (దీచీూ) యాక్ట్‌లోని సెక్షన్ 504 (శాంతి భంగం కలిగించేలా ఉద్దేశపూర్వకంగా అవమానించడం), సెక్షన్ 505 (ప్రజా విద్వేషాన్ని ప్రేరేపించే ప్రకటనలు చేయడం) కింద కేసులు నమోదు చేశారు

సువేందు అధికారి పీఏ దారుణ హత్య

గ్యాస్ బండతో సామాన్యుడి జేబుకు చిల్లు

హైదరాబాద్, మే 7, (వాయిస్ టుడే) : నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యుడిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ముఖ్యంగా వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర భారీగా పెరగడంతో, హోటళ్లు, టీఫిన్ సెంటర్లు పిజి వసతి గృహాల్లో అల్పాహారం నుండి భోజనం వరకు అన్నింటి ధరలు సామాన్యుడికి భారంగా మారుతున్నాయి. ప్రస్తుత ధరల పెరుగుదల వల్ల హోటల్ యజమానులు తమ వ్యాపారాన్ని కొనసాగించడం కష్టతరంగా మారింది. వాణిజ్య సిలిండర్ ధర ఏకంగా రూ. 3,314 కి చేరడంతో, ఇడ్లీ, వడ, దోశ వంటి టిఫిన్లపై రూ. 5 నుండి రూ. 10 వరకు పెంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనివల్ల సామాన్యుడి జేబుకు చిల్లు పడుతోందిధరల భారాన్ని తట్టుకోలేక చాలా మంది టిఫిన్ సెంటర్ల యజమానులు గ్యాస్ స్టౌలను పక్కనపెట్టి, మళ్లీ పాతబడిన కట్టెల పొయ్యిలను వినియోగిస్తున్నారు. అమీర్‌పేట, దిల్సుఖ్‌నగర్, ఎస్ఆర్ నగర్, కూకట్‌పల్లి ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది. ఇది కేవలం హోటళ్లకే పరిమితం కాలేదు, పిజి హాస్టళ్లలో కూడా వడ్డించే భోజనం టిఫిన్ల ధరలు భారీగా పెరిగాయి. నెలకు ఉండే మెస్ ఛార్జీలను యాజమాన్యాలు ఇప్పటికే రూ. 1,000 నుండి రూ. 1,500 వరకు పెంచేశాయి. ఈ పెంపుతో తక్కువ వేతనాలతో జీవించే ఉద్యోగులు విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నిరుద్యోగులు చిరుద్యోగులు తమ రోజువారీ బడ్జెట్‌ను ఎలా సర్దుబాటు చేసుకోవాలో తెలియక సతమతమవుతున్నారు. మరోవైపు, చిన్న హోటళ్లు కనీసం 5 కేజీల సిలిండర్లను వాడుకుందామన్నా అవి దొరకడం గగనంగా

(మిగతా 2వ పేజీలో)

మే 17 తర్వాతే సౌత్ కు నైరుతి రుతుపవనాలు

చెన్నై మే 7, (వాయిస్ టుడే) : తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఇటీవలే వాతావరణ శాఖ శుభవార్త చెప్పింది. మే 17న రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవులను తాకుతాయని వెల్లడించింది. దీంతో ఈసారి ముందస్తు వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ క్రమంలో తాజాగా ఐఎండీ మరో షాకింగ్ విషయం తెలిపింది. తూర్పు, మధ్య పసిఫిక్ ఉపరితల జల ఉష్ణోగ్రతల్లో కొంత సమయం తటస్థ స్థితిలో ఉన్న తర్వాత ఇప్పుడు అవి ఎల్‌నినో సూచక స్థాయి దిశలో కదలడంతో ప్రపంచ వాతావరణ సంస్థలు ఎల్‌నినో ప్రారంభం అయిందని అధికారికంగా ప్రకటించింది. ఈ మార్పులు గత తటస్థ కాలంతో పోలిస్తే సముద్ర వాతావరణంలో శక్తి విడుదల, గాలుల నమూనాల్లో మార్పులకు దారి తీస్తాయి. ఇన్కాయిస్ ప్రక్రియలో ఈ ఏడాది ఏప్రిల్‌లో వరకు సాధారణ పరిస్థితులు కొనసాగాయని, తాజా డేటా ఆధారంగా ఎల్‌నినో దశలోకి మారినట్లు ప్రకటించింది. ప్రస్తుత మే నుంచి 2027 జనవరి వరకు ఈ పరిస్థితులు స్థిరంగా కొనసాగొచ్చని బులిటెన్ విడుదల చేసింది. పసిఫిక్ జల ఉష్ణోగ్రతలను పరిశీలించేందుకు ఇన్కాయిస్ ప్రత్యేక డీప్ లెర్నింగ్ మోడల్ బేయేసియన్ కన్వల్యూషనల్ న్యూరల్ నెట్వర్క్‌ను అభివృద్ధి చేసింది. ఈ మోడల్ గత ఎల్‌నినో, లా నినా నమూనాలతోపాటు ఇప్పటి డేటాను

(మిగతా 2వ పేజీలో)

విద్యార్థులకు రేవంత్ సర్కార్

తీపి కబురు..

బోధన రుసుముల చెల్లింపులపై కీలక నిర్ణయం

హైదరాబాద్, మే 7 : తెలంగాణ ప్రభుత్వం విద్యా రంగంలో కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. 2026-27 విద్యాసంవత్సరం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల్లో కొత్త విధానాన్ని అమలు చేయనుంది. ముందుగా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకే నిధుల విడుదలలో ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, ఏ ఏడాది ఫీజులు ఆ ఏడాదే చెల్లించేలా ఎస్సీ సంక్షేమ శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. మరోవైపు.. విద్యా వ్యవస్థలో సంస్కరణల నేపథ్యంలో ఇంటర్ అడ్మిషన్ల షెడ్యూల్‌ను బోర్డు తాత్కాలికంగా రద్దు చేసింది. తెలంగాణ రాష్ట్ర విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ముఖ్యంగా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంటున్న ఫీ రియంబర్స్‌మెంట్,

(మిగతా 2వ పేజీలో)

వాయిస్ ఆఫ్ ప్రజలు
శుక్రవారం, మే 8, 2026

సువేందు అధికారి పీఏ దారుణ హత్య

కోల్ కత్తా, మే 7 : పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మరోసారి రక్తపాతం చోటు చేసుకుంది. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ 207 స్థానాలతో ప్రభంజనం సృష్టించి, తృణమూల్ కాంగ్రెస్ 15 ఏళ్ల పాలనకు చరమగీతం పాడింది. ఈ విజయాన్ని ఉత్సవంగా జరుపుకుంటున్న వేళ విషాదం చోటు చేసుకుంది. రాష్ట్రంలో ప్రతిపక్ష నేతగా ఉండి ఈ గెలుపులో కీలక పాత్ర పోషించిన సువేందు అధికారికి కుడి భుజంగా పేరుగాంచిన చంద్రనాథ్ రథ్ దారుణ హత్యకు గురయ్యారు. కోల్‌కతా శివారు ప్రాంతమైన మధ్యమ్‌గ్రామ్‌లో బుధవారం రాత్రి ఈ దుర్ఘటన జరిగింది. బుధవారం రాత్రి సుమారు పదిన్నర గంటల సమయంలో చంద్రనాథ్ రథ్ తన నివాసానికి మహీంద్రా స్కార్పియో వాహనంలో తిరిగి వెళ్తుండగా ఈ దాడి జరిగింది. మధ్యమ్‌గ్రామ పరిధిలోని దోహారియా జంక్షన్ వద్ద దుండగులు ఆయన వాహనాన్ని అడ్డుకున్నారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం ఒక కారు చంద్రనాథ్ కారును ముందు నుంచి అడ్డుకోగా, వెనుక నుంచి మోటార్ సైకిళ్లపై వచ్చిన దుండగులు కారుపై విచక్షణరహితంగా కాల్పులు జరిపారు. చంద్రనాథ్ కారులో డ్రైవర్ పక్క సీటులో కూర్చొని ఉండగా, దుండగులు పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో కిటికీ అద్దాల గుండా కాల్పులు జరిపారు. మొత్తం మూడు నుంచి నాలుగు రౌండ్ల కాల్పులు జరిగినట్టు ప్రాథమిక సమాచారం. ఈ దాడిలో చంద్రనాథ్ శరీరంలోకి మూడు బుల్లెట్లు దూసుకుపోయాయి. తీవ్రంగా గాయపడిన ఆయనను వెంటనే సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనలో చంద్రనాథ్ కారు డ్రైవర్ కూడా బుల్లెట్ గాయాలకు గురై, ప్రస్తుతం కోల్‌కతా ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. చంద్రనాథ్‌ను పరీక్షించిన వివా సిటీ ఆసుపత్రి వైద్యులు షాకింగ్ వివరాలు వెల్లడించారు. ఆయన ఛాతీ ఎడమ భాగంలో రెండు బుల్లెట్లు, పొత్తికడుపులో ఒక బుల్లెట్ దిగింది. ఛాతీలోకి దూసుకెళ్లిన బుల్లెట్ ఆయన గుండెను పూర్తిగా చీల్చివేసి అవతలి వైపు నుంచి బయటకు వచ్చాయని, దీని వల్ల ఆయన స్పాట్‌లోనే మృతి చెందారు. ఆసుపత్రికి తీసుకొచ్చే సమయానికే ఆయనలో స్పందన లేని డాక్టర్ ప్రతిమ్ సేన్‌గుప్తా వెల్లడించారు. చంద్రనాథ్ రథ నేపథ్యం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఆయన కేవలం ఒక రాజకీయ నాయకుడి అనుచరుడు మాత్రమే కాదు, దేశం కోసం పని చేసిన మాజీ సైనికుడు. చంద్రనాథ్ రథ్ దాదాపు రెండు దశాబ్దాల పాటు భారత వైమానిక దళంలో పని చేశారు. రామకృష్ణ మిషన్‌లో విద్యాభ్యాసం చేసిన ఆయనపై రామకృష్ణ మిషన్ సిద్ధాంతాల ప్రభావం ఎక్కువగా ఉండేది. ఒక దశలో ఆయన ఆధ్యాత్మిక జీవితం వైపు వెళ్లాలని కూడా భావించారు. వైమానిక దళం నుంచి స్వచ్ఛంద పదవి విరమణ పొందిన తర్వాత కొంత కాలం కార్పొరేట్ రంగంలో పని చేశారు 2019లో సువేందు అధికారి మమతా బెనర్జీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న సమయంలో చంద్రనాథ్ ఆయన అధికారిక బృందంలో చేరారు. సువేందు అధికారి 2020లో టీఎంసీని వీడి బీజేపీలో చేరినప్పుడు చంద్రనాథ్ కూడా ఆయన వెంట నడిచారు. తక్కువ కాలంలోనే సువేందుకి అత్యంత సన్నిహితుడిగా, రాజకీయ వ్యూహకర్తగా పేరు తెచ్చుకున్నారు. ముఖ్యంగా భవానీపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో మమతా బెనర్జీపై సువేందు సాధించిన విజయంలో చంద్రనాథ్ కీలక పాత్ర పోషించారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఘటన జరిగిన వెంటనే ఆసుపత్రికి చేరుకున్న సువేందు అధికారి తీవ్ర ఆవేశానికి గురయ్యారు. ఇది సాధారణ హత్య కాదని, పక్కా ప్రణాళికతో జరిగిన కోల్డ్ బ్లడెడ్ మర్డర్ అని అన్నారు. గత రెండు మూడు రోజులుగా దుండగులు చంద్రనాథ్ కదలికలపై నిఘా ఉంచి, రెక్కీ నిర్వహించినట్టు సువేందు ఆరోపించారు. కారులో చంద్రనాథ్ ఎక్క కూర్చుంటారో కూడా ముందే తెలుసుకుని సరిగ్గా కిటికీ అద్దాల గుండా కాల్పులు జరపడం ఇది ప్రొఫెషనల్ హంతకుల పనేనని ఆయన అన్నారు. గత 15 ఏళ్లుగా రాష్ట్రంలో కొనసాగుతున్న మహా జింగ్ల రాజ్ ఫలితమే ఇదని ఇలాంటి గూండాలను ఏరిపారేసే పనిని బీజేపీ ప్రారంభిస్తుందని ఆయన హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్ డీజీపీ సిద్ధ్ నాథ్ గుప్తా ఈ కేసును స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. దర్యాప్తులో కొన్ని కీలక విషయాలు బయటపడ్డాయి. హత్యకు ఉపయోగించిన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే ఆ వాహనంపై ఉన్న నెంబర్ ప్లేట్ నకిలీదని తేలింది. దాన్ని ట్యాపరింగ్ చేశారని పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలంలో లైవ్ రౌండ్లు, ఖాళీ తూటాలు పోరెన్సిక్ బృందం సేకరించింది. నాలుగు మోటార్ సైకిళ్లై వచ్చి ఉండవచ్చని, దాడి తర్వాత కారు వదిలేసి బైక్?లపై పరారయ్యారని ప్రాథమిక విచారణలో తేలింది. హత్యపై స్పందించిన టీఎంసీ, తమకు సంబంధం లేదని ప్రకటించింది. ఈ హత్యపై సీబీఐ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేసింది. మొత్తానికి చంద్రనాథ్ రథ్ హత్య బెంగాల్ రాజకీయాల్లో పెన సంచలనంగా మారింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరక ముందే జరిగిన ఈ ఘటన, రాబోయే రోజుల్లో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం ఎలా ఉండబోతోందో సూచిస్తోంది.

కరీంనగర్‌లో టెన్షన్.. టెన్షన్...

కరీంనగర్, మే 7 : తెలంగాణలో నేతల మాటలు శృతి మించుతున్నాయి. ఈ మాటల మంటలు కారణంగానే కరీంనగర్‌లో ఉద్రికత పరిస్థితులు నెలకొన్నాయి. బండి సంజయ్, కేటీఆర్, పాడి కౌశిక్ రెడ్డి మధ్య మాటల తూటాలు, సవాళ్ల పర్వం సాగుతోంది. ఇది కాస్త దాడుల వరకు వెళ్లింది. బీఆర్ఎస్ నేతల మాటలకు ఆగ్రహం వ్యక్తం చేసిన బీజేపీ శ్రేణులు దాడులకు దెగబడ్డారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీస్‌పై దాడి చేశారు. ప్రెస్ మీట్ జరుగుతుండగానే బీజేపీ కార్యకర్తలు దౌర్జన్యానికి దిగారు. కౌశిక్ రెడ్డి కారును ధ్వంసం చేశారు. రేవంత్, కేటీఆర్ కుమ్మక్కు అయ్యారని అందుకే కాళేశ్వరం సహా ఏ కేసులు కూడా ముందుకు కదలడం లేదని బండి సంజయ్ ఆరోపించారు. దీనిపై కేటీఆర్ కౌంటర్ ఇస్తూ ఎవరు ఎవరితో కుమ్మక్కు అయ్యారో తమకు తెలుసని అన్నారు. చాలా విషయాలు తమ వద్ద ఉన్నాయని సమయం వచ్చినప్పుడు అన్నింటినీ బయటపెడతామన్నారు. ఎవరికి ఎవరు సహాయ మంత్రిగా ఉన్నారో తేలుస్తామని అన్నారు. కచ్చితంగా ఒక్కో విషయం వెలుగులోకి వస్తుందని అన్నారు. దీనిపై బండి సంజయ్ ప్రెస్‌మీట్ పెట్టి కేటీఆర్‌పై తీవ్ర పదజాలంతో దూషించారు. మనిషి పుట్టక అంటూ అసభ్యంగా మాట్లాడారు. కరీంనగర్‌లో పూర్తిగా కేటీఆర్‌ను తిరగనివ్వబోమని అన్నారు. తనపై చేసిన ఆరోపణలు రుజువులు చూపించాలని డిమాండ్ చేశారు. డ్రగ్స్ మత్తులో ఏదేదో మాట్లాడుతున్నారని దునుమాడారు. దీనికి బీఆర్ఎస్ కౌంటర్ ఇచ్చింది. డ్రగ్స్ వాడే అలవాటు బండి సంజయ్‌కు ఉందని అన్నారు. ఉన్నమాట అంటే ఉలుకు ఎందుకని ప్రశ్నించారు. తంబాకు, డ్రగ్స్ తినే అలవాటులో బండి సంజయ్ ఏదేదో మాట్లాడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ దాడిని తట్టుకోలేకపోయిన బీజేపీ శ్రేణులు ఆగ్రహంతో ఊగిపోయారు. ప్రెస్ మీట్ జరుగుతున్న టైంలోనే మాజీ మంత్రి గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీస్‌పై దాడికి తెగబడ్డారు. లోపల ప్రెస్ మీట్ జరుగుతున్న టైంలోనే విధ్వంసం సృష్టించారు. దాడులపై పాడి కౌశిక్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై బీజేపీ, కాంగ్రెస్ కలిపి హత్యాయత్నం చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యేపైనే ఈ స్థాయిలో దాడులు చేస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. తనను చంపేందుకు ఇప్పటికే రెక్కీ నిర్వహించారని ఇదే విషయాన్ని ఉదయం పెట్టిన ప్రెస్ మీట్‌లో చెప్పానని అన్నారు. అదే ఇప్పుడు కనిపించిందన్నారు. తనను చంపేందుకు కత్తులు, బాంబులు, రాడ్లతో వచ్చారని అన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ దారి తప్పిందని చెప్పడానికి వరుసగా జరుగుతున్న ఘటనలే ఉదాహరణ అని అన్నారు.

దాడులు చేసిన వారిపై కఠినంగా శిక్షించాలని పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేయాలన్నారు. వారిని వెంటనే రిమాండ్‌కు తరలించాలని అన్నారు. తాను ఎవరినీ రెచ్చగొట్టలేదని అన్నారు. బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు తాము రియాక్ట్ అయ్యామని అన్నారు.

పాడి కౌశిక్ రెడ్డి అరెస్ట్

కరీంనగర్‌లో టెన్షన్ టెన్షన్. మాటలు హద్దు దాటి దాడుల వరకు వెళ్లాయి. పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని అరెస్టు చేసి తరలించారు. దీనిపై ఆయన మండిపడ్డారు. దాడులు చేసిన వారిని వదిలేసి తనను అదుపులోకి తీసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.అరెస్టుకు ముందు ప్రెస్‌మీట్ పెట్టిన కౌశిక్ రెడ్డి రేవంత్, బండి సంజయ్‌పై తీవ్ర విమర్శలు చేశారు. కరీంనగర్‌లో తుపాకి సంస్కృతి పెరుగుతుందని ప్రశ్నించామని అందుకే బండి సంజయ్, రేవంత్ రెడ్డి కలిసి తన గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తాను ఎప్పుడూ ఎవరినీ రెచ్చగొట్టలేదన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే దానికి తమ పార్టీ నుంచి కౌంటర్ ఇచ్చామన్నారు. కేటీఆర్ డ్రగ్స్ తీసుకుంటున్నారని కామెంట్ చేయడంతోనే తాము కూడా బండి సంజయ్‌పై అనుమానం వ్యక్తం చేశామన్నారు. అలా తంబాకు, డ్రగ్స్ కలిపి తీసుకోవడం వల్లే తలపై జట్టు ఊడిపోయిందని అన్నట్టు చెప్పారు. వారు చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తే దాడులు చేస్తారా అని కౌశిక్ రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని అన్నారు. అందుకే ఎమ్మెల్యేగా తనపై హత్యా యత్నం జరిగిందని ఆరోపించారు. ఎమ్మెల్యేగా ఉన్న తనకే రాష్ట్రంలో రక్షణ లేకుంటే సామాన్యుడి పరిస్థితి ఏంటని నిలదీశారు. ఇలాంటి వారికి అధికారం కట్టబెడితే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థమవుతుందన్నారు. వాళ్లా కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావును తిట్టొచ్చు కానీ తాము మాత్రం కౌంటర్ ఇవ్వకూడదా అని ప్రశ్నించారు. తనపై జరిగిన దాడిలో ప్రభుత్వ హస్తం కూడా ఉందన్నారు కౌశిక్ రెడ్డి. ఉదయం పెట్టిన ప్రెస్‌మీట్‌లో తనపై హత్యాయత్నం జరుగుతుందని చెప్పానని అన్నారు. దీని కోసం రెక్కీ నిర్వహిస్తున్నారని కూడా వెల్లడించారని వివరించారు. చెప్పినట్టుగానే తనపై రాడ్లు, కత్తులు, బాంబులతో వచ్చి దాడికి తెగబడ్డారని ఆరోపించారు. తన కార్యకర్తలకు గాయాలు అయ్యాయని, తన కారు ధ్వంసమైందని చెప్పారు. పోలీసులకు కూడా గాయాలు అయినట్టు వెల్లడించారు. దాడికి పాల్పడిన వారిపై అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేయాలన్నారు. అయితే ఇక్కడ దాడి చేసిన వారిని వదిలేసి తనను అరెస్టు చేయడంపై మండిపడ్డారు.

ఇతర వాహనాలకు ఇబ్బంది లేకుండా, సాధారణ ట్రాఫిక్‌లో రేవంత్ కాన్వాయ్ ప్రయాణం

శంషాబాద్ విమానాశ్రయం నుంచి
తన నివాసం వరకు సాధారణ ట్రాఫిక్‌లో కాన్వాయ్

ట్రాఫిక్ పూర్తిగా నిలిపివేయకుండా
ఒకే లైన్‌లో వాహనాలను కదలడానికి అనుమతి

తన కాన్వాయ్ కోసం ప్రజలను
ఇబ్బందిపెట్టవద్దని రేవంత్ రెడ్డి ఇటీవల ఆదేశాలు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాన్వాయ్ శంషాబాద్ విమానాశ్రయం నుంచి జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసం వరకు సాధారణ ట్రాఫిక్‌లోనే ప్రయాణించింది. ఆయన కాన్వాయ్ కోసం ఎక్కడా ట్రాఫిక్‌ను నిలిపివేయలేదు. తన కాన్వాయ్ కోసం సామాన్యులను ఇబ్బంది పెట్టవద్దని, వాహనాలను ఆపవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డీజీపీకి ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం ఆయన కాన్వాయ్ సాధారణ ట్రాఫిక్‌లో ప్రయాణించింది. విమానాశ్రయం నుంచి తన నివాసం వరకు సాధారణ ట్రాఫిక్‌లోనే వెళ్లడం గమనార్హం. ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేయడానికి బదులు ఒక లైన్‌లో వాహనాలను అనుమతించాలని ముఖ్యమంత్రి సూచించిన నేపథ్యంలో, పోలీసు అధికారులు ఈరోజు దానిని పాటించారు. ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేయకుండా పోలీసులు వాహనాలను ఒకే లైన్‌లో కదలడానికి అనుమతించారు.

జూన్ 8న హైదరాబాద్‌లో చేప ప్రసాదం పంపిణీ

హైదరాబాద్ మే 7 : హైదరాబాద్ నగరంలో ఏటా ఇచ్చే చేప ప్రసాదం పంపిణీకి ముహూర్తం ఖరారైంది. ఈ ఏడాది జూన్ 8వ తేదీన బత్తిని కుటుంబం ఈ మందును పంపిణీ చేయనుంది. ఆస్తమా, శ్వాసకోశ ఇబ్బందులతో బాధపడే వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చు. ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా భారీగా జనం వస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.చేప మందు పంపిణీ కార్యక్రమం నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరగనుంది. మృగశిర కార్తె సందర్భంగా బత్తిని హరినాథ్ గౌడ్ వారసులు ఈ సేవను అందిస్తారు. వేలాది మంది వచ్చే అవకాశం ఉన్నందున ఎగ్జిబిషన్ మైదానంలో అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రసాదం కోసం వచ్చే వారు ముందుగానే వేదిక వద్దకు చేరుకోవడం మంచిది. దశాబ్దాల కాలంగా బత్తిని కుటుంబ సభ్యులు ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. దీనిని తీసుకోవడానికి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా జనం వస్తుంటారు. ప్రభుత్వం కూడా భక్తుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటోంది. జూన్ 8న ఉదయం నుంచే పంపిణీ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుంది.

తెలంగాణ వ్యాప్తంగా హైడ్రా విస్తరణకు ప్రభుత్వం నిర్ణయం

రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. హైడ్రాకు ఇప్పటికే చాలా ఫిర్యాదులు, దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిష్కరించడం కోసమే నాలుగు వారాలు ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు రంగనాథ్ వివరించారు.హైడ్రాకు వ్యతిరేకంగా కొంతమంది న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారని పేథ?్కనారు. మరోవైపు హైడ్రా చర్యల కారణంగా ఇప్పటి వరకూ సుమారుగా రూ. 85 వేల కోట్ల విలువైన భూములను కబ్జాల నుంచి కాపాడామని రంగనాథ్ వెల్లడించారు. మరో సంవత్సరంలోగా రూ.లక్ష కోట్లు విలువైన భూములను కాపాడుతామని స్పష్టం చేశారు. కేవలం హైడ్రా పరిధిలోనే పది లక్షల కోట్ల విలువైన భూములు కబ్జాకు గురైనట్లు సమాచారం ఉందని హైడ్రా కమిషనర్ తెలిపారు.మరోవైపు జూన్ ఎనిమిదో తేదీ నుంచి హైడ్రా ప్రజావాణి కార్యక్రమం తిరిగి ప్రారంభం కానుంది. పెండింగ్ ఫిర్యాదులను ప్రాధాన్య క్రమంలో పరిష్కరించాలనే ఉద్దేశంతో నాలుగు వారాల పాటుఈ కార్యక్రమానికి విరామం ఇచ్చారు.. ప్రజావాణితో పాటు, వివిధ రూపాల్లో వచ్చిన ఫిర్యాదులన్నీ క్లియర్ చేయాలనే ఉద్దేశంతోనే ఈ విరామాన్ని ప్రకటించినట్లు తెలిపారు. అయితే గతంలో ఇచ్చిన ఫిర్యాదుదారులు అత్యవసరమని భావిస్తే కార్యాలయానికి వచ్చి నేరుగా కలవవచ్చని రంగనాథ్ తెలిపారు.

విజయ్‌కు గవర్నర్ షాక్..

ఫిగర్ చూపిస్తేనే ప్రమాణం.. అధికారికంగా ప్రకటించిన గవర్నర్ వీసీకే, సీపీఐ వంటి పార్టీలు మండిపడుతున్నాయి. అతిపెద్ద పార్టీగా నిలిచిన విజయ్‌ను ముందుగా ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించాలి. మెజార్టీని నిరూపించుకోవడానికి అసెంబ్లీ వేదికగా అవకాశం ఇవ్వాలి తప్ప, రాజ్ భవన్‌లో సంతకాలు అడగడం రాజ్యాంగ విరుద్ధం అని వారు వాదిస్తున్నారు. కేంద్రం జోక్యంతోనే గవర్నర్ ఇలా చేస్తున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు. దాదాపు 60 ఏళ్ల ద్రవిడ పార్టీల ఆధిపత్యానికి విజయ్ గట్టి దెబ్బ కొట్టినప్పటికీ, రాజ్యాంగపరమైన చిక్కులు ఆయనను వేధిస్తున్నాయి. ప్రస్తుతం విజయ్ ఇతర చిన్న పార్టీలు, స్వతంత్రుల మద్దతు కూడగట్టే పనిలో నిమగ్నమయ్యారు. ఇదే సమయంలో డీఎంకే, ఏఐఏడీఎంకేలు కూడా ఈ అనిశ్చితిని తమకు అనుకూలంగా మార్చుకుని మళ్లీ చక్రం తిప్పాలని చూస్తున్నాయి. తమిళనాడు భవిష్యత్తు ఇప్పుడు ఆ 6 మంది ఎమ్మెల్యేల మద్దతు పైనే ఆధారపడి ఉంది. 118 మంది ఎమ్మెల్యేల సంతకాలతో కూడిన జాబితాను విజయ్ ఎప్పుడు సమర్పిస్తారో, అప్పుడే దళపతి సీఎం పీఠంపై సందిగ్ధత తొలగిపోతుంది.

ఆపరేషన్ సిందూర్' భారత శౌర్యానికి నిదర్శనం

తొలుత ఉగ్రవాదుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు ఘన నివాళు లర్పించారు. అనంతరం ఆయన కేక్ కట్ చేసి కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలుపుతూ, పహల్గామ్ దాడికి ప్రతీకారంగా లష్కర్, జైష్ వంటి ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యం విరుచుకుపడి ఉగ్రవాదులను మట్టుబెట్టడం భారత శౌర్యానికి నిదర్శనమని కొనియాడారు. ఈ విజయం దేశ భద్రత పట్ల నరేంద్ర మోదీ ప్రభుత్వ కఠిన వైఖరిని చాటిచెబుతోందని ఆయన పేర్కొన్నారు.

గ్యాస్ బండతో సామాన్యుడి జేబుకు చిల్లు

మారింది. దొరికినా, వాటికి కూడా అదనంగా 800 వరకు వసూలు చేస్తున్నారని హోటల్ యజమానులు వాపోతున్నారు. ధరలను మరోసారి పెంచితే హాస్టల్ వదిలి సొంతూళ్లకు వెళ్లాల్సిందేనని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని వాణిజ్య గ్యాస్ ధరలను నియంత్రించాలని, లేదంటే హోటల్ పరిశ్రమ విద్యార్థుల బడ్జెట్ పూర్తిగా కుప్పకూలుతుందని యజమానులు, ప్రజలు కోరుతున్నారు.

మే 17 తర్వాతే సౌత్ కు నైరుతి రుతుపవనాలు

కలిపి భవిష్యత్ పరిస్థితులను విశ్లేషిస్తుంది. ఇది వచ్చే ఎల్‌నినో లేదా లా నినా ప్రక్రియలను సుమారు 24 నెలల ముందుగా అంచనా వేసే సామర్థ్యాన్ని అందిస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. ఇది దేశాలు, వ్యవసాయ, నీటి నిర్వహణ, విద్యుత్ విభాగాలకు ప్రణాళిక రూపకల్పనకు కీలక సాధనంగా మారుతుంది.భూమధ్యరేఖ వెంబడి పసిఫిక్‌లో ఎల్‌నినో స్థితి ఏర్పడితే, అది భారత నైరుతి రుతుపవనాల ప్రవేశం, బలం, వర్షపాత పంపిణీ మీద గణనీయ ప్రభావం చూపే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు పలుమార్లు గుర్తించారు. ఈ సందర్భంలో సాధారణ కంటే తక్కువ లేదా అసమంగా వర్షాలు కురుస్తాయి. కొన్ని ప్రాంతాల్లో అనావృష్టి పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంటుంది. ఇప్పటికే కొన్ని అధ్యయనాలు ఈ ఏడాది భారత్‌లో వర్షపాతం సగటు కంటే తక్కువగా ఉండొచ్చని, రుతుపవన రాక కొంత ఆలస్యమవుతుందని సూచిస్తున్నాయి. ఇది వ్యవసాయం, నీటి లభ్యత, విద్యుత్ ఉత్పత్తి, ఆహార ధరల వంటి అనేక రంగాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది.ఎల్‌నినో ప్రభావం పసిఫిక్‌తో పరిమితం కాకుండా, ఉత్తర హిందూ మహాసముద్రంలో కూడా బలమైన, దీర్ఘకాలిక సముద్రపు వేడిగాలుల ఏర్పాటుకు దారి తీస్తోంది. ఈ వాతావరణ ప్రస్థానాలు స్థానిక ఉష్ణోగ్రతల్లో పెరుగుదలతో పాటు పవన వేగం, చక్రవాతాల నమూనాల్లో మార్పులు కలిగిస్తాయి. ఇవి సముద్ర జీవవైవిధ్యం, చేపబట్టు ప్రదేశాలు, ద్వీపు పర్యావరణాలు వంటి అనేక విభాగాలపై ఒత్తిడిని పెంచుతాయి. పర్యావరణ సమతౌల్యం దెబ్బతినడం వల్ల స్థానిక ఆర్థిక వ్యవస్థలు, ఆహార భద్రత, మానవ ఆరోగ్యానికి పొడుగు సమయ ప్రభావాలు కొనసాగే అవకాశం ఉంది.

విద్యార్థులకు రేవంత్ సర్కార్ తీపి కబురు..

స్కాలర్‌షిప్‌ల పంపిణీలో పారదర్శకత, వేగం పెంచేందుకు 2026-27 విద్యాసంవత్సరం నుండి కొత్త విధానాన్ని తీసుకురాబోతోంది. ఇందుకోసం సంక్షేమ శాఖల నోడల్ విభాగమైన ఎస్సీ సంక్షేమ శాఖ పలు కీలక ప్రతిపాదనలను సిద్ధం చేసింది. ఈ కొత్త విధానం ప్రకారం ఫస్ట్ కమ్ - ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అంటే ఎవరు ముందుగా దరఖాస్తు చేసుకుంటే వారికే నిధుల విడుదలలో తొలి ప్రాధాన్యత లభిస్తుంది.ప్రస్తుతం అమల్లో ఉన్న విధానం ప్రకారం.. ఒక విద్యాసంవత్సరానికి సంబంధించిన ఫీజులను మరుసటి ఏడాది చెల్లించే ఆనవాయితీ ఉంది. దీనివల్ల విద్యార్థులు, కళాశాల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. దీనిని అధిగమించేందుకు ఇకపై ఏ విద్యాసంవత్సరానికి సంబంధించిన ఫీజులను అదే ఏడాదిలో పూర్తి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఏటా సుమారు రూ.2,300 కోట్ల నుంచి రూ.2,400 కోట్ల వరకు ఉండే ఈ నిధులను ఒకేసారి విడుదల చేయాలా? లేక విడతల వారీగా ఇవ్వాలా? అనే అంశంపై స్పష్టమైన టైమ్ షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించనుంది. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల నేపథ్యంలో.. అడ్మిషన్లు ప్రారంభమయ్యేలోపే ప్రభుత్వం దీనిపై పూర్తి స్పష్టత ఇవ్వనుంది.ఇదిలా ఉండగా.. తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా మండలి విద్యార్థులకు షాక్ ఇస్తూ అడ్మిషన్ల షెడ్యూల్‌ను తాత్కాలికంగా రద్దు చేసింది. మే 4న విడుదల చేసిన అడ్మిషన్ల సర్క్యులర్‌ను తక్షణమే ఉపసంహరించుకుంటున్నట్లు బోర్డు కార్యదర్శి ప్రకటించారు. రాష్ట్ర విద్యాశాఖ కొన్ని కీలక సంస్కరణలు ప్రవేశపెట్టాలని భావిస్తున్నందున.. పాత షెడ్యూల్‌ను నిలిపివేసి కొత్త మార్గదర్శకాలను రూపొందిస్తున్నట్లు సమాచారం.

మానవీయ, సాంఘిక శాస్త్రాల ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్న గీతం

పటాన్ చెరు : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్) 2026-27 విద్యా సంవత్సరానికి గాను మానవీయ, సాంఘిక శాస్త్రాలలో యూజీ, పీజీ, పీహెచ్.డీ. కోర్సులలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ విషయాన్ని ఆ స్కూల్ ఇన్ ఛార్జి డైరెక్టర్ డాక్టర్ శామ్యూల్ థరు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. జాతీయ లేదా రాష్ట్ర స్థాయి ప్రవేశ పరీక్షలలో పొందిన చెల్లుబాటు అయ్యే స్కోర్ల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని, అలాగే గీతం ప్రవేశ పరీక్ష (గాట్-2026) ద్వారా కూడా అర్హత సాధించవచ్చని ఆయన తెలియజేశారు. మూడో దశ ప్రవేశ పరీక్ష ఈనెల 17న జరుగుతుందని, ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను మే 14వ తేదీలోగా అధికారిక పోర్టల్ ద్వారా ఆన్ లైన్లో సమర్పించవచ్చన్నారు. యూజీ స్థాయిలో- సైకాలజీ, ఎకనామిక్స్, ఇంగ్లీషు, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, జర్నలిజం అండ్ మీడియా స్టడీస్, సోషియాలజీ, సినిమాటిక్ ఆర్ట్స్ అండ్ డిజైన్లు ప్రధాన అంశం (మేజర్)గా బీ.ఏ. కోర్సును అందజేస్తున్నామని తెలిపారు. వీటిలో చేరిన విద్యార్థులకు వారు ఎంచుకున్న విభాగాలలో బలమైన పునాదిని అందించడంతో పాటు, వారి విశ్లేషణాత్మక, సృజనాత్మక, భావ ప్రకటనా నైపుణ్యాలను మెరుగుపరిచేలా ఆయా కోర్సులను రూపొందించామని తెలిపారు. లిబరల్ ఎడ్యుకేషన్ లో భాగంగా, విద్యార్థుల ఆసక్తి, ఆశయాల ఆధారంగా 600కు పైగా సబ్జెక్టుల కలయికలను ఎంచుకోవచ్చన్నారు. పీజీ స్థాయిలో- అప్లైడ్ సైకాలజీ, ఎకనామిక్స్, ఇంగ్లీషులలో ఎం.ఏ. కోర్సులను అందిస్తున్నామని తెలిపారు. ఇవి ఉన్నతమైన సైద్ధాంతిక పరిజ్ఞానం, పరిశోధనా సామర్థ్యాలు, ఆచరణాత్మక అనువర్తనాలపై దృష్టి పెడతాయన్నారు. ఇక డాక్టోరల్ కోర్సులలో- అప్లైడ్ సైకాలజీ, ఎకనామిక్స్, ఇంగ్లీషు, పొలిటికల్ సైన్స్, సోషియాలజీలలో పీహెచ్.డీ. కోర్సులు ఉన్నాయని ఆయన తెలియజేశారు. ఈ రంగాలలో ఉన్నత-నాణ్యత గల పరిశోధన, విద్యా నైపుణ్యాన్ని పెంపొందించడమే వీటి లక్ష్యమన్నారు. విద్యతో పాటు క్రీడలు, ఇతరత్రా కార్యకలాపాలు, సామాజిక పరస్పర చర్యలతో అనుసంధానించడం ద్వారా సంపూర్ణ విద్యకు జీఎస్ హెచ్ఎస్ ప్రాధాన్యత ఇస్తోందని డాక్టర్ శామ్యూల్ వివరించారు. అత్యాధునిక బోధనా ప్రయోగశాలలు, విస్తృతమైన ఇంటర్నషిప్ అనుభవం, పరిశోధనపై దృష్టి సారించే అధ్యాపక బృందం సమగ్రమైన బోధనను అందించడంలో సహాయపడుతుందని తెలిపారు. విద్యాపరమైన విజయాలకు అతీతంగా విద్యార్థులను తీర్చిదిద్ది, విజ్ఞానవంతమైన దృక్పథాలు, విమర్శనాత్మక ఆలోచనల ద్వారా సమాజానికి అర్థవంతంగా దోహదపడేలా వారికి సాధికారత కల్పించడానికి గీతం కట్టుబడి ఉందన్నారు. గీతంలోని దాదాపు 33 శాతం మంది విద్యార్థులు ప్రతిభ ఆధారిత ఉపకార వేతనాలు పొందుతున్నారని, వీటిలో బోధనా రుసుము, భోజనం, వసతి ఖర్చులతో సహా పూర్తి మినహాయింపులున్నాయని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 14వ తేదీలోగా ఆన్ లైన్లో దరఖాస్తు చేసుకుని, మే 17న జరిగే ప్రవేశ పరీక్ష, వ్యక్తిగత ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. ఇతరత్రా సమాచారం కోసం షషష.స్త్రఱ్ఖఎ.వసబ ను సందర్శించాలని, లేదా 888 4984 000 ను సంప్రదించాలని సూచించారు.

SIR ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించండి

ఓటర్ జాబితాలోని దొంగ ఓట్లను ప్రక్షాళన చేయండి..

బిఎల్వోలు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా విధులు నిర్వహించేలా చూడండి: నీలం మధు ముదిరాజ్

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో మర్యాద పూర్వక భేటీ..

పటాన్చెరు : పటాన్‌చెరు నియోజకవర్గంలో ఎన్నికల ప్రక్రియలో భాగంగా నిర్వహిస్తున్న SIR ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని, ఓటర్ల జాబితాలోని అక్రమాలను తక్షణమే ప్రక్షాళన చేయాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు. సంగారెడ్డి జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన ప్రతీక్ జైన్ ను గురువారం సంగారెడ్డిలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకముగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నెలకొన్న ఎన్నికల సంబంధిత సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి, సుదీర్ఘంగా చర్చించారు.

పటాన్‌చెరులో ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడటమే లక్ష్యంగా, కేంద్ర ఎన్నికల సంఘం సూచించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో అత్యంత పకడ్బందీగా అమలు చేయాలని నీలం మధు కోరారు. గతంలో నియోజకవర్గంలో పెద్ద ఎత్తున నమోదైన దొంగ ఓట్ల అంశాన్ని ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తూ, ఒకే ఇంటి నంబర్‌పై వందలాది ఓట్లు ఉండటం అప్రజాస్వామికమని మండిపడ్డారు. ఇటువంటి అక్రమ ఓట్లను గుర్తించి తక్షణమే తొలగించాలని, అర్హులైన స్థానిక ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ఓటర్ల జాబితా రూపకల్పనలో కీలక పాత్ర పోషించే బీ ఎల్ ఓ ల తీరుపై ప్రత్యేక దృష్టి సారించి బీ ఎల్ ఓ లు కేవలం కార్యాలయాల్లో కూర్చుని జాబితా తయారు చేయకుండా, ప్రతి ఇంటికీ వెళ్లి సమగ్ర క్షేత్రస్థాయి సర్వే నిర్వహించేలా కఠిన ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్‌ను కోరారు. మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లను తొలగించడంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా, పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించినప్పుడే నిజమైన ప్రజా తీర్పు వెలువడుతుందని, ఇందుకోసం జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన నవజ్యోతి పాఠశాల విద్యార్థులను సన్మానించిన మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ మే 7(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ షాపూర్ నగర్ వారి నివాసంలో గిరి నగర్ డివిజన్ పరిధిలోని నవజ్యోతి పాఠశాలలో విద్యను అభ్యసించిన 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు కనబరిచిన ఆ పాఠశాల విద్యార్థులను స్థానిక మాజీ శాసనసభ్యులు శ్రీశైలం గౌడ్ విద్యార్థులను అభినందించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థిని విద్యార్థులందరూ మరింత ఉన్నతమైన ఫలితాలను సాధించి జీవితంలో మంచి స్థాయికి వివిధ రంగాల్లో ఎదగాలని ఆకాంక్షించారు. అదేవిధంగా అత్యున్నతమైన ఫలితాలు సాధించిన పలువురు విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో శ్రీశైలం గౌడ్ నగదు బహుమతి సైతం విద్యార్థులకు అందజేశారు. ఈ ఫలితాలను సాధనకు కృషిచేసిన పాఠశాలలోని ఉపాధ్యాయ బృందానికి శుభాకాంక్షలు అభినందనలు తెలియపరుస్తూ ప్రతి సంవత్సరం ఇలాగే ఉన్నత ఫలితాలను పాఠశాల యజమాన్యం సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఇంద్రా రెడ్డి , స్కూల్ ఇన్చార్జ్ రామిరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ ఆదిత్య కృష్ణారెడ్డి, మరియు ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ సమస్యలపై సీఎం సలహాదారికి వినతిపత్రం

కుత్బుల్లాపూర్ మే 7(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యల పరిష్కారం మరియు అభివృద్ధి కొరకు ఈ రోజు లితెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు, రాజ్యసభ సభ్యులు వేంనరేందర్ రెడ్డిమర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసిన లికుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మరియు టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గడ్డం రాజేందర్ రెడ్డి, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికను విజయవంతం చేద్దాం

13 కోట్లతో రీ-టెండర్ నిర్వహించి, మార్కెట్ కమిటీ సభ్యులతో కలిసి పనులకు శంకుస్థాపన చేసిన చైర్మన్ శివానందం.

పటాన్ చెరు (వాయిస్ టుడే న్యూస్): పటాన్ చెరు మార్కెట్ యార్డ్‌లో 168 షాటర్ల నిర్మాణానికి సంబంధించి గతంలో రూ.7 కోట్లతో కాంట్రాక్టు కుదుర్చుకున్నప్పటికీ, పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో నూతనంగా ఎన్నికైన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యేపూరి శివనందం ఆధ్వర్యంలో రూ.13 కోట్లతో రీ-టెండర్ నిర్వహించి, మార్కెట్ కమిటీ సభ్యులతో కలిసి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ కొల్లూరు రాజశేఖర్, వ్యవసాయ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. అనంతరం మార్కెట్ యార్డ్‌లో 'ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక'లో భాగంగా రైతు వారోత్సవాలను నిర్వహించారు. వ్యవసాయ మరియు అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నియోజకవర్గ రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. బ్యాంకుల ద్వారా రైతులకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక పంట రుణాలు అందుబాటులో ఉంటాయని, సహకార సంఘాలు మరియు రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా సేవలు అందుతాయని, వ్యవసాయ ఉత్పత్తుల విక్రయానికి మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ యేపూరి శివనందం, కమిటీ సభ్యులు తెలిపారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు

సికింద్రాబాద్ (వాయిస్ టుడే):నగర పోలీస్ కమిషనర్ సజ్జనర్ ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ప్రధానంగా జన సమర్థంగాల ప్రాంతాలు, బహిరంగ ప్రదేశాలు ఆర్ట్స్ కాలేజ్ రైల్వే స్టేషన్, తార్నాక చౌరస్తా, ఎ గ్రౌండ్ తదితర ప్రాంతాల్లో పోలీసులు పర్యటించి బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం, మద్యపానం, గంజాయి వంటి వాటిని సేవిస్తున్న పలువురిని పట్టుకుని వారికి కౌన్సిలింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏసిపి జగన్, ఇన్స్పెక్టర్ మహేష్, డి ఐ లెనిన్, ఎస్సై జయ చంద్ర, కరుణాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా "శ్రీశ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ చతుర్ద వార్షిక బ్రహ్మోత్సవాలు

బ్రహ్మోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

కుత్బుల్లాపూర్ మే 7(వాయిస్ టుడే) 132 - జీడిమెట్ల డివిజన్ జీడిమెట్ల గ్రామంలోని శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, మాతా గోవిందమాంబ, శ్రీ విరాట్ విశ్వకర్మ గాయత్రి కాశీ విశ్వేశ్వర స్వామి విశాలాక్షి దేవాలయ చతుర్త వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించగా ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై వీరబ్రహ్మేంద్రస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కృష్ణమాచారి, శేఖర్ చారి, బాలా చారి, సంతోష్ చారి, శ్రీనివాస్ చారి, బ్రహ్మ చారి, బి. శ్రీనివాస్ చారి, చంద్రశేఖర్ చారి, రవి చారి, సాయిలు చారి, మోహన్ రావు చారి, డివిజన్ నాయకులు కాలే నగేష్, కాలే గణేష్, బాల మల్లేష్, రాజు యాదవ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సాకి చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్చెరు : చెరువుల సంరక్షణ కోసం శరవేగంగా గుర్రపుడెక్క తొలగింపు పనులను చేపడుతున్నట్లు పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని సాకి చెరువులో 70 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న గుర్రపు డెక్క తొలగింపు పనులను గురువారం ఉదయం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమయ్యే లోపు పనులు పూర్తి కావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డివిజన్ పరిధిలోని తిమ్మక్క చెరువు, జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని దోషం చెరువులలోను ఒక కోటి రూపాయల అంచనా వ్యయంతో అతి త్వరలో గుర్రపు డెక్క తొలగింపు పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. గుర్రపు డెక్క తొలగించడం వలన చెరువు నీటి సామర్థ్యం పెరగడంతో పాటు చెరువుల పరిశుభ్రత మెరుగుపడటం, భూగర్భ జలాలు మట్టం పెరగడం వంటి లాభాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, సపాన దేవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు నివార్తి, ఎట్టయ్య, టప్ప కుమార్, నర్రా బిక్షపతి, వెంకటేష్, సత్తయ్య, రామ్మోహన్, ఏఈ ఫైజాన్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య భద్రతకు సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ

కుత్బుల్లాపూర్ మే 7(వాయిస్ టుడే): అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు చేయించిన ఎల్ఓసీ పత్రాలను ఈరోజు చింతల్ లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయా డివిజన్లకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు లబ్దిదారులకు అందజేశారు. ఎల్వోసీ పత్రాల అందజేతలో భాగంగా సిఎంసి 128 - చింతల్ డివిజన్ శివానగర్ కు చెందిన జి. అలివేలు భర్త పరంధాములు కు రూ.2,00,000/- (రెండు లక్షలు) మంజూరు కాగా, 129 - సూరారం డివిజన్ విశ్వకర్మ కాలనీకి చెందిన జి. ఫణి వెంకటేష్ సంతోష్ తండ్రి ఈశ్వర రావుకు రూ.2,00,000/-(రెండు లక్షలు) మంజూరు కాగా, 131- కుత్బుల్లాపూర్ డివిజన్ కు చెందిన సీ.నారాయణ తండ్రి లేట్ సత్యమ నాయుడు కు రూ.2,00,000/- (రెండు లక్షలు) మంజూరు కాగా ఎల్వోసీ పత్రాలను ఆయా డివిజన్లకు చెందిన నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, నియోజకవర్గ మాజీ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, నాయకులు మొహమ్మద్ రఫీ, సత్తిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కేపీ.వెంకటేష్, బస్వరాజ్, కిషోర్ చారి, రాకేష్ జలిగాం, నార్లకంటి బాలయ్య, సామ్రాట్, ఎండీ.నసీరుద్దీన్, రమణా రెడ్డి, ఆంజనేయులు, శంకర్, వెంకటేష్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలన 99 రోజుల ప్రణాళికలో దుండిగల్‌లో పారిశుద్ధ్య కార్యక్రమాల పరిశీలన

కుత్బుల్లాపూర్ మే 7(వాయిస్ టుడే): ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా దుండిగల్ సర్కిల్ పరిధిలో చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కరణ్ పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా దుండిగల్ సర్కిల్ పరిధిలో ఉన్న ట్రీ పార్క్‌ల వద్ద కంపోస్ట్ పిట్‌లను ఏర్పాటు చేయడం జరిగింది. అనంతరం దుండిగల్ తండా--2లో ఉన్న డంపింగ్ యార్డ్‌ను ఆయన పరిశీలించారు. తడి చెత్తను కంపోస్టింగ్ విధానంలో నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా కమర్షియల్ షాపులు, హోటళ్ల వద్ద తప్పనిసరిగా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ నిబంధనను పాటించని వారికి "నో బిన్ -- నో లైసెన్స్" విధానం అమలు చేయడంతో పాటు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ప్రతి ఇంటి నుండి వచ్చే చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేసి స్వచ్ఛ ఆటోలుకు అందించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. వీధులను పరిశుభ్రంగా ఉంచాలని, రోడ్ల పక్కన పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని, చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అలాగే రోడ్డు పక్కన ఉన్న సిడడి వ్యర్థాలను వెంటనే తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డిప్యూటీ ఇంజనీర్ అన్వేష్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ అశోక్ కుమార్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ పి. సాత్విక్, ఎస్ ఎఫ్ ఎ లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
శుక్రవారం 8 మే 2026

కాంగ్రెస్, బీజేపీలపై ఎంపీ వద్దిరాజు మండిపాటు

"డైవర్షన్ పాలిటిక్స్" చేస్తున్నారని ఆరోపణలు

హైదరాబాద్, (వాయిస్ టుడే): బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కాంగ్రెస్, బీజేపీ పార్టీలపై తీవ్ర విమర్శలు చేశారు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు కమ్ముక్కు రాజకీయాలు చేస్తూ ప్రాంతీయ పార్టీల అస్థిత్వాన్ని దెబ్బతీయాలని కుయుక్తులు పన్నుతున్నాయని ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి పాలన చేతకావడం లేదని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదని అన్నారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి పలుమార్లు ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షాలను కలిసినప్పటికీ రాష్ట్రానికి లాభం కలగలేదని విమర్శించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ అగ్ర నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఎంపీ రవిచంద్ర ఆరోపించారు. ముఖ్యంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి.రామారావుపై చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమని అన్నారు. ప్రతిపక్ష నాయకులపై కేసులు బనాయించి, వేధింపులకు పాల్పడుతున్నారని, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి క్యాంప్ కార్యాలయాలు, వాహనాలపై దాడులు జరగడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. శాంతిభద్రతలు కాపాడాల్సిన బాధ్యత ఉన్న కేంద్ర మంత్రి సంజయ్ అనవసర వ్యాఖ్యలతో ఉద్రిక్తతలు సృష్టిస్తున్నారని, ప్రధాని మోదీ తెలంగాణ పర్యటన నేపథ్యంలో ఇటువంటి పరిస్థితులు తలెత్తడం విచారకరమన్నారు. ఇకనైనా అనుచిత వ్యాఖ్యలకు స్వస్తి చెప్పి రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి మరిన్ని నిధులు తీసుకురావడంపై దృష్టి సారించాలని సంజయ్, రేవంత్ రెడ్డిలకు ఎంపీ వద్దిరాజు సూచించారు.

హై స్కూల్ కంప్యూటర్ టీచర్ల పునర్నియామకంపై ఇరువురు ముఖ్యమంత్రులకు విజ్ఞప్తి

హైదరాబాద్, (వాయిస్ టుడే): అఖండ ఆంధ్రప్రదేశ్‌లో 2008 నుంచి 2015 వరకు ప్రభుత్వ హై స్కూల్‌లలో పనిచేసిన కంప్యూటర్ టీచర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కంప్యూటర్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. కర్మాన్ఘాట్ ఎల్బీనగర్ స్టేట్ ఆఫీస్‌లో నిర్వహించిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ మాట్లాడుతూ, అనుభవజ్ఞులైన కంప్యూటర్ టీచర్లు గత కొన్ని సంవత్సరాలుగా నిరుద్యోగంగా ఉన్నారని తెలిపారు. విద్యార్థులకు డిజిటల్ విద్య అందించడంలో వీరి పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచం డిజిటల్ వైపు వేగంగా మారుతున్న నేపథ్యంలో, ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ విద్యకు ప్రాధాన్యత మరింత పెరిగిందని తెలిపారు. ఇలాంటి సమయంలో అనుభవం కలిగిన టీచర్లను తిరిగి నియమిస్తే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడంతో పాటు డిజిటల్ లెర్నింగ్ బలోపేతం అవుతుందని అన్నారు. అందువల్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి గార్లు స్పందించి, అఖండ ఆంధ్రప్రదేశ్‌లో పనిచేసిన హై స్కూల్ కంప్యూటర్ టీచర్లను తక్షణమే పునర్నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శోభ, అబ్రహం, రాంప్రసాద్, జలాన్ తదితరులు పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్య వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

పాల్గొన్న సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్

హైదరాబాద్, (వాయిస్ టుడే): మాజీ ఏఐసిసి అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 54వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మిద్దెల జితేందర్ మాట్లాడుతూ, దామోదరం సంజీవయ్య పేద కుటుంబంలో జన్మించి కష్టపడి ఉన్నత స్థాయికి ఎదిగిన మహానేత అని కొనియాడారు. అత్యున్నత పదవులు చేపట్టినా జీవితాంతం నిరాడంబర జీవనం గడిపారని, సాధారణ ప్రజల సమస్యలను దగ్గరగా అర్థం చేసుకున్న నాయకుడిగా నిలిచారని పేర్కొన్నారు. సొంత ఇల్లు కూడా లేకుండానే ఆయన మరణించడం ఆయన నిజాయితీకి, ప్రజాసేవ పట్ల ఉన్న అంకితభావానికి నిదర్శనమని తెలిపారు. సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సంజీవయ్య పాత్ర విశేషమని, నేటి యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదళ్ నాయకులు వాజిద్ నాయక్, బండి సురేందర్, ఈతికార్ వెంకటేష్, మురళీధర్, శకుంతల, శానవాజ్ తదితరులు, కార్యకర్తలు మరియు పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

హైకోర్టు కేసుతో బసవ పున్నయ్య, రాంచందర్‌లకు సంబంధం లేదు సంబంధం

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య

హైదరాబాద్, మే 07: రాష్ట్ర, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీలపై తాను హైకోర్టులో వేసిన కేసు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) యూనియన్ కే సంబంధం ఉందని, యూనియన్ నుంచి తనను ఎవరూ బహిష్కరించలేదనీ, టీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక, రాష్ట్ర అధ్యక్షుడిగా తాను కోర్టు లో కేసు వేయడం జరిగిందని ఆ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య స్పష్టం చేశారు. ఈ కేసుతో తమకు సంబంధం లేదంటున్న పిల్లి రాంచందర్, బసవపున్నయ్య అనే వ్యక్తులు తమ టీడబ్ల్యూజేఎఫ్ సంఘానికే సంబంధం లేరని, వారు తమ సంఘం నాయకులు కాదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ యూనియన్ కు అక్రెడిటేషన్ కమిటీల్లో ప్రాతినిధ్యం ఇవ్వకపోవడం వల్ల కమిటీల్లో తమ వాయిస్ లేక చాలా మంది జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుందనే ఉద్దేశంతో తాను ప్రభుత్వం పై కేసు వేశానే తప్ప, జర్నలిస్టులకు అన్యాయం చేయడం కోసం కాదని అన్నారు. తమ యూనియన్ నుంచి తొలగించబడిన వ్యక్తులు స్వప్రయోజనాలు, వారి పత్రిక ప్రయోజనాలు పొందడం కోసం ప్రభుత్వంతో కుమ్మక్కై నాపై గోబెల్ ప్రచారం చేస్తున్నారని మామిడి సోమయ్య ఖండించారు.

తాను ఒక జర్నలిస్టు యూనియన్ స్థాపించి గత 20 ఏళ్ళుగా జర్నలిస్టుల సమస్యలపై పోరాడుతున్న నాపై కొందరు కుట్రపన్ని యూనియన్ లో లేకుండా చేయాలనుకున్నారని, కానీ నావైపు ఉన్న మెజారిటీ జర్నలిస్టులు వాళ్ళ ఆటలు సాగనీయలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మీడియా అక్రెడిటేషన్ల జీవో 252 ప్రకారం రాష్ట్ర, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీలలో తమ టీడబ్ల్యూజేఎఫ్ సభ్యులకు ప్రాతినిధ్యం కల్పించాలని, లేదంటే కమిటీ నిర్ణయాలు అమలు కాకుండా చూడాలని కోరుతూ తాను హైకోర్టును ఆశ్రయించడం జరిగిందని తెలిపారు. తనను టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ నుంచి బహిష్కరించినట్లు చట్టవిరుద్ధమైన ప్రకటన చేసిన బసవపున్నయ్య, పిల్లి రాంచందర్ లపై కోర్టులో కేసు వేయడం జరిగిందని, అదేవిధంగా కార్మిక శాఖలో ఫిర్యాదు కూడా చేశామని పేర్కొన్నారు. అబద్ధపు ప్రచారాలతో అసలు సమస్యను పక్కదారి పట్టిస్తున్నారని, తమ నేతృత్వంలోని టీడబ్ల్యూజేఎఫ్ కు కార్మిక శాఖ గుర్తింపు ఇచ్చిందన్న విషయం అవాస్తవమని అన్నారు. తాను కోర్టులో వేసిన కేసు పెండింగ్ లో ఉండగా కార్మిక శాఖ గుర్తింపు ఎలా ఇస్తుందని ఆయన ప్రశ్నించారు. తప్పుడు ప్రచారంతో ఇటు జర్నలిస్టులను, అటు ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. అబద్ధపు మాయ మాటలతో అటు ప్రభుత్వాన్ని, ఇటు అధికారులను మచ్చిక చేసుకొని తమ సంఘం ద్వారా లబ్ది పొందేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. టీడబ్ల్యూజేఎఫ్ పైన గానీ, సంఘం వ్యవస్థాపకుల పైన గానీ మరోసారి తప్పుడు ప్రచారం చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని మామిడి సోమయ్య హెచ్చరించారు.

గోవుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్, మే 07: రాష్ట్రంలో గోవధ నిరోదక చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసి గోవుల రక్షణకు తగు చర్యలు తీసుకోవాలని లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ ట్రస్టీ రితీష్ జాగిర్దార్, శ్రీ జైన్ సేవా సంఘ్ హైదరాబాద్ పీఆర్ఓ ప్రవీణ్ పాండ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ ఐపిఎస్ ను కలిసి విజ్ఞప్తి చేసినట్లు వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా విచ్చలవిడిగా గోవులను హైదరాబాద్ నగరానికి తరలించే అవకాశం ఉన్నందున ఎక్కడిక్కడ చెక్ పోస్టులను ఏర్పాటు చేసి అక్రమంగా గోవులను తరలించకుండా పోలీస్ సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేయాలని వారు కోరారు. నిత్యం వేలాది పశువులను వధిస్తుండటంతో గోవుల సంతతి తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి వెన్నెముకగా ఉన్న పశువులు మన ఆర్థిక వ్యవస్థకు జీవనాధారమని, శతాబ్దాలుగా మానవ మనుగడకు, సమాజానికి గోవులు ఎన్నో రకాలుగా ఉపయోగపడుతున్నాయని అన్నారు.

అనధికార ఎన్నికలు చెల్లవు

మున్నూరు కాపు మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ రావు హెచ్చరిక

హైదరాబాద్, మే 7(వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ రావు కీలక ప్రకటన విడుదల చేశారు. మహాసభ నియమావళి ప్రకారం, హైకోర్టు ఆదేశాల మేరకు గత ఏడాది తాను ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నికయ్యానని తెలిపారు. ఇటీవల కొందరు వ్యక్తులు తిరిగి ఎన్నికలు నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నారని, కుల బంధువులు అలాంటి వారిని నమ్మవద్దని సూచించారు. వారికి ఎలాంటి అధికారాలు లేవని, సమాజాన్ని తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై, వారికి సహకరిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే కొందరిపై క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయని, మరికొందరికి మున్నూరు కాపు భవనంలో ప్రవేశించకుండా పర్మినెంట్ ఇంజక్షన్ ఆర్డర్లు ఉన్నాయని పేర్కొన్నారు. అనధికారికంగా నిర్వహించే ఎన్నికలు చెల్లవని, వాటిని నిర్వహించే వారిపై కాంటెంప్ట్ ఆఫ్ కోర్టు కేసులు కూడా నమోదు చేస్తామని పిల్లి శ్రీనివాస్ రావు స్పష్టం చేశారు.

కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్‌కు అభినందనల వెల్లువ

– కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకంపై రాష్ట్రవ్యాప్తంగా హర్షం

కూకట్ పల్లి, మే 7(వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన టీపీసీసీ ఉపాధ్యక్షుడు, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్‌కు అభినందనల వెల్లువ కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కమ్మ సేవా సంఘాల నాయకులు, హైదరాబాద్ నగరానికి చెందిన ప్రముఖ కమ్మ నాయకులు, వివిధ సామాజిక సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున ఆయన నివాసానికి, కార్యాలయానికి చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు. బొకేలు అందించి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించిన నాయకులు బండి రమేష్ నియామకాన్ని స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేశారు. కమ్మ కార్పొరేషన్ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు రాష్ట్రంలోని ఇతర కార్పొరేషన్‌ల పురోగతికీ సమాన ప్రాధాన్యం ఇవ్వాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, పార్టీ పట్ల బండి రమేష్ చూపుతున్న నిబద్ధత, నిజాయితీ, కష్టపడి పనిచేసే తత్వం, అందరినీ కలుపుకుపోయే నాయకత్వ శైలి కారణంగానే కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆయనకు కీలక బాధ్యతలను అప్పగిస్తోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపుతున్న చిత్తశుద్ధి, పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలకు తీసుకెళ్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అభినందనలకు స్పందించిన బండి రమేష్ మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. తాను చేపట్టిన ప్రతి పదవిని గౌరవప్రదమైన బాధ్యతగా భావిస్తూ, అందరినీ కలుపుకుపోతూ తన శక్తిమేర సేవలు అందిస్తానన్నారు. కమ్మ కార్పొరేషన్‌ను ప్రజలకు మరింత ఉపయోగపడే సంస్థగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని, అన్ని వర్గాల అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో చురుకైన నాయకుడిగా ఎదుగుతున్న బండి రమేష్‌కు వివిధ వర్గాల నుంచి వస్తున్న మద్దతు, అభినందనలు ఆయన ప్రజాదరణను ప్రతిబింబిస్తున్నాయని రాజకీయ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి.

కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపికైన బండి రమేష్‌కు ఘన సన్మానం

కూకట్‌పల్లి, మే 7(వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపికైన టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్‌ను ఆంజనేయనగర్ కాలనీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు కర్క పెంటయ్య, కూకట్‌పల్లి నియోజకవర్గ ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు కర్క నాగరాజు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రజాసేవలో బండి రమేష్ తనదైన ముద్ర వేసుకొని ప్రజల ఆదరణ పొందుతున్నారని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

రైతు డిక్లరేషన్ అమలుపై రాహుల్ గాంధీకి ఎంపీ వద్దిరాజు సవాల్

హైదరాబాద్, (వాయిస్ టుడే): బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీకు రైతు డిక్లరేషన్ అమలుపై సూటిగా ప్రశ్నలు సంధించారు. వరంగల్ ఆర్ట్స్ కాలేజీ మైదానంలో 2023 మే 6న ప్రకటించిన "రైతు డిక్లరేషన్" అమలు ఎంతవరకు జరిగిందో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ డిక్లరేషన్ పేరిట రైతుల ఓట్లు సంపాదించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రైతులకు చేసిన మేలు గురించి చర్చించేందుకు వరంగల్, ఖమ్మం లేదా హైదరాబాద్‌లో సమావేశం పెట్టాలా? లేక ఢిల్లీకి రావాలా? అంటూ రాహుల్ గాంధీకి సవాల్ విసిరారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీ మాలోతు కవిత తదితరులు పాల్గొన్నారు. వరంగల్‌లో నిర్వహించిన "రైతు సంగ్రామ సదస్సు" విజయవంతమైందని పేర్కొన్న ఆయన, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ప్రసంగం రైతుల్లో ఉత్సాహాన్ని నింపిందన్నారు. దీనిని

తట్టుకోలేక కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రైతులకు "రైతుబంధు" వంటి పథకాలతో పాటు 24 గంటల ఉచిత విద్యుత్, సాగునీరు అందించడంతో వ్యవసాయం అభివృద్ధి చెందిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో ధాన్యం కొనుగోళ్లు సరిగా జరగక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. రైతులు 40--50 రోజులుగా కొనుగోలు కేంద్రాల వద్దే వేచి ఉండాల్సి వస్తోందని, పంటల బోనస్ పేరుతో పూర్తి మొత్తాన్ని చెల్లించలేదని ఆయన విమర్శించారు. కరెంట్, సాగునీరు, ఎరువుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని ఎంపీ వద్దిరాజు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి, వై. సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై బగ్గుమన్న బిజెపి శ్రేణులు

రణరంగంగా మారిన
కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్

కౌశిక్ రెడ్డి కారు ధ్వంసం బిజెపి నేతల అరెస్ట్

కరీంనగర్ జిల్లాలో అడుగుపెట్టనీయం
ఖబర్దార్ కౌశిక్ రెడ్డి

పోలీస్ కమిషనర్‌పై
నోటికొచ్చినట్టు మాట్లాడుతావు

కేంద్రమంత్రి బండి సంజయ్‌పై
పిచ్చి కూతలు కూస్తావు

కౌశిక్ రెడ్డినోరు అదుపులో పెట్టుకోకపోతే
తీవ్ర పరిణామాలు ఉంటాయి

బిజెపి పార్లమెంట్ కన్వీనర్
బోయిన్పల్లి ప్రవీణ్ రావు హెచ్చరిక

కరీంనగర్,మే 07(వాయిస్ టుడే): కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కరీంనగర్ బిజెపి శ్రేణులు బగ్గుమన్నారు.కరీంనగర్లోని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీస్ వద్ద కౌశిక్ రెడ్డి ఉన్నాడనే సమాచారం మేరకు పార్లమెంటు కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు స్థానిక బిజెపి శ్రేణులతో వెళ్లి ఆందోళన చేశారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్,బిజెపి శ్రేణుల మధ్య వాక్యుద్ధం జరిగి తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. అనంతరం పోలీసులు రంగప్రవేశం చేసి బోయినపల్లి ప్రవీణ్ రావు అదుపులోకి తీసుకున్నారు.ఈ సందర్భంగా ప్రవీణ్ రావు మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఫైర్ అయ్యారు.కౌశిక్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడకపోతే నాలుక చీరేస్తామని ఘాటుగా హెచ్చరించారు.కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,ఎమ్మెల్యే కేటీఆర్ కు ఇచ్చిన 48 గంటల వ్యవధి దగ్గర పడిందని,డ్రగ్ ట్రస్టులకు కేటీఆర్ భయపడుతున్నారనే విషయం కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలతో స్పష్టంగా అర్థమవుతుందన్నారు.కేటీఆర్ కు, బిఆర్ఎస్ నేతలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన సవాల్ ను స్వీకరించే దమ్ము లేక,కౌశిక్ రెడ్డితో అనవసర వ్యాఖ్యలు, రాద్ధాంతం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి కేంద్ర మంత్రి బండి సంజయ్ గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకుని జాగ్రత్తగా మాట్లాడాలని, లేకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు పోలీస్ కమిషనర్ పై నోటికొచ్చినట్టు మాట్లాడుతావు కేంద్రమంత్రి బండి సంజయ్ పై పిచ్చి కూతలు కూస్తావు మాట్లాడేటప్పుడు సోయండి మాట్లాడుతున్నావా? నీకు సంస్కారం ఉందా? నువ్వు ఎమ్మెల్యే వా? అని ఆయన తీవ్రంగా మండిపడ్డారు.కౌశిక్ రెడ్డి ఇప్పటికైనా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలని,లేకపోతే కౌశిక్ రెడ్డిని కరీంనగర్ జిల్లాలో అడుగుపెట్టనీయం ఖబర్దార్ కౌశిక్ రెడ్డి అని ఆయన ఈ సందర్భంగా తీవ్ర హెచ్చరిక చేశారు.

యూ సి ఎఫ్ నిధులతో కరీంనగర్ సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు

కార్పొరేటర్ అంజన్ కుమార్

కరీంనగర్, మే 07(వాయిస్ టుడే): పట్టణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూ సి ఎఫ్) నిధుల సాధనకు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు తెలుపుతోందని కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు, 26వ డివిజన్ కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ తెలిపారు. కార్పొరేషన్ లో జరిగిన అత్యవసర సర్వసభ్య సమావేశంలో యూ సి ఎఫ్ నిధులతో చేపట్టనున్న ప్రాజెక్టుల ఎజెండాపై మాట్లాడుతూ పాత నగర ప్రాంతాల పునరాభివృద్ధి, మార్కెట్ల ఆధునీకరణ, పట్టణ చలనశీలత, లాస్ట్-మైల్ కనెక్టివిటీ, మోటారురహిత రవాణా, నీరు-పారిశుధ్య మౌలిక సదుపాయాలు,వాతావరణ స్థితిస్థాపక పట్టణాభివృద్ధి వంటి కీలక రంగాలలో పరివర్తనాత్మక ప్రాజెక్టులకు ఈ నిధులు ఉపయోగపడతాయని అన్నారు. యూ సి ఎఫ్ స్కీం కింద కేంద్ర ప్రభుత్వ సహాయం 25శాతం, రాష్ట్ర ప్రభుత్వం 25శాతం, మిగిలిన 50శాతం బ్యాంకులు లేదా పి పి పి ద్వారా సమకూర్చుకోవాలి.ఈ స్కీం సక్సెస్ కావాలంటే మన జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్,మంత్రిశ్రీధర్ బాబు సహకారం తీసుకొని, స్వయంగా మునిసిపల్ శాఖ మంత్రిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలవాలి. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతోనే మనం ఈ నిధులకు ఎలిజిబుల్ అవుతాం అని అంజన్ కుమార్ స్పష్టం చేశారు. గతంలో కూడా స్మార్ట్ సిటీ రావడానికి రాష్ట్ర ప్రభుత్వ సహకారమే కారణమని, ఎమ్మెస్సార్ మంత్రిగా ఉన్నప్పుడు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం తీసుకురావడం వల్లనే నేడు కరీంనగర్ స్మార్ట్ సిటీగా ఎదిగిందని గుర్తుచేశారు. అదే విధంగా యూ సి ఎఫ్ ను కూడా సాధించుకుంటామని, కాంగ్రెస్ పార్టీ ఈ తీర్మానాన్ని పూర్తిగా సమర్థిస్తూ ఆమోదిస్తోందని తెలిపారు.

కౌశిక్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకో..

భౌతిక దాడులు తప్పవని
ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం తీవ్ర హెచ్చరిక

కరీంనగర్, మే 07 (వాయిస్ టుడే): బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై,కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన అనుచిత అభ్యంతరకర వ్యాఖ్యలపై చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం తీవ్రంగా మండిపడ్డారు.ఈ సందర్భంగా డా. మేడిపల్లి సత్యం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ద్వారా ప్రెస్ నోట్ విడుదల చేయడం జరిగింది.మిస్టర్ కౌశిక్ రెడ్డి,ఇకనైనా నోరు అదుపులో పెట్టుకో.వ్యక్తిగతంగా ఆరోపణలు చేయడం మానుకోకపోతే ఇదేవిధంగా దాడులు చేయడం కొనసాగుతుంది. తెలంగాణలో ఒక ప్రశాంతమైన వాతావరణం ఉంది.ఈ వాతావరణాన్ని చెడగొట్టే ప్రయత్నం చేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకునేది లేదు అని తీవ్రంగా హెచ్చరించారు.ఇక్కడున్నది రేవంత్ రెడ్డి సర్కార్.శాంతి భద్రతల పట్ల విఘాతం కలిగితే ఎట్టి పరిస్థితిలో ఊరుకునేది లేదు.ఎన్నోసార్లు మీరు,మీ నాయకులు ముఖ్యమంత్రి మీద, అధికారుల మీద,మంత్రుల మీద ఇష్టానుసారంగా మాట్లాడారు.ఇప్పటివరకు నడిచింది,ఇకపై నడవదని హెచ్చరిస్తున్నాం అని స్పష్టం చేశారు.కేటీఆర్ గానీ,హరీష్ రావు గానీ ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని,కాంగ్రెస్ పార్టీ సహనానికి పరీక్షలు పెట్టే ప్రయత్నం చేయొద్దని సూచించారు.మీరు పిచ్చిపిచ్చి కారుకూతలు చేయడం మానకపోతే ఎక్కడ దొరికితే అక్కడ దాడులు చేసే పరిస్థితి ఉంటుంది.కౌశిక్ రెడ్డి ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలి.కరీంనగర్‌లో ఒక పునర్జన్మ లభించిందని సంతోషపడాలి.ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకపోతే ప్రజలంతా తిరగబడే పరిస్థితి వస్తుంది అని మండి పడ్డారు.రాజకీయాలలో ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నప్పుడు హుందాగా వ్యవహరించాలని హితవు పలికారు.అధికారం కోల్పోయి ఇక జీవితంలో మళ్ళీ అధికారంలోకి రామని ఒక తీవ్ర ఒత్తిడిలో బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.మంత్రులను,ఎమ్మెల్యేలను ఇష్టం వచ్చినట్లు తిడితే ప్రజలు ఊరుకునే పరిస్థితి లేదు.తస్మాత్ జాగ్రత్త కౌశిక్ రెడ్డి అని మరోసారి తీవ్రమైన హెచ్చరిక చేశారు.

మార్కెట్ కమిటీని అత్యుత్తమంగా తీర్చిదిద్దుతాం..

రైతులకు సేవ చేయడం గొప్ప అవకాశం

కరీంనగర్ మార్కెట్ కమిటీ
నూతన చైర్మన్ ఆకుల నర్సయ్య

కరీంనగర్,మే 07(వాయిస్ టుడే): రైతులకు సేవ చేసే గొప్ప అవకాశం రావడం అదృష్టమని నిరంతరం అన్నదాతకు అండగా నిలిచి అభివృద్ధికి తోడ్పడుతామని కరీంనగర్ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ ఆకుల నర్సయ్య పేర్కొన్నారు. కరీంనగర్ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ప్రభుత్వం నియమించిన నేపథ్యంలో సాయంత్రంకరీంనగర్ డిసిసి కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య పాలకవర్గ సభ్యులతో సభ్యులతో విలేఖరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ మార్కెట్ కమిటీని అత్యుత్తమంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.పాలకవర్గం నియమకంతో పాటు తనకు చైర్మన్ గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రాజ్యసభ సభ్యుడు వేము నరేందర్ రెడ్డి,ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాసు చింతకుంట విజయ రమణారావు ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం,కవ్వంపల్లి సత్యనారాయణ,సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేష్,ఆల్ ఫోర్స్ నరేందర్ రెడ్డి,కాంగ్రెస్ కార్పోరేషన్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్,మాజీ ఎమ్మెల్యేలు ఆరేపల్లి మోహన్ కోడూరు సత్యనారాయణ గౌడ్ నేతలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.ప్రభుత్వం పెద్ద బాధ్యత అప్పగించిందని రైతులకు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.24 గంటల పాటు అందుబాటులో ఉండి అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు.తాను వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చానని రైతుల కష్టాలు తెలుసయు అని వారికి అండగా ఉంటామని తెలిపారు.పంట ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించే విషయంలో ధాన్యం కొనుగోలు విషయంలో అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఏ ఇబ్బంది రాకుండా చూసుకుంటామని ఆకుల నరసయ్య తెలిపారు.గతంలో సుల్తానాబాద్ సింగిల్ విండో డైరెక్టర్ గా వైస్ చైర్మన్ గా చైర్మన్‌గా పని చేశానని గుర్తు చేశారు.రైతుల సాధకబాధకాలు రైతుల కష్టాలు దగ్గర్నుంచి చూశానని పేర్కొన్నారు. రైతు బిడ్డగా రైతులకు నిరంతరం తోడ్పాటు అందిస్తానని తెలిపారు.రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్,దుద్దిళ్ల శ్రీధర్ బాబు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు సూచనలు సలహాల మేరకు మార్కెట్ కమిటీని అత్యుత్తమంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.రాష్ట్రంలోనే మార్కెట్ కమిటీ ని ఆదర్శంగా తయారు చేస్తామని అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని వారి అడుగుజాడల్లో తమ పాలకవర్గం నడుస్తుందని తెలిపారు.తమ నియామకానికి సహకరించిన పెద్దలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పంజాల శ్రీనివాస్ గౌడ్,బోనాల శ్రీనివాస్, మీసాల శంకర్ రావణవేణి సంపత్, మాలోతు మాలతి, శివనాథుని వెంకటేశ్వర్లు పల్లా శివకుమార్, కార్పొరేటర్లు భాస్కర్ నాయక్ కల్లేపల్లి శారద బాలరాజు, ఆకుల నందిని ఉదయ్,గంట శ్రీనివాస్,కాంతాల జగన్ రెడ్డి, ఇక్రమ్ సికిందర్,కాంగ్రెస్ నాయకులు ఎన్నం రజిత రెడ్డి,అర్ష మల్లేశం, పెద్దపల్లి రవీందర్,గడ్డం విలాస్ రెడ్డి, వేల్పుల వెంకటేష్,సరిల్ల రతన్ రాజు,గండి రాజేశ్వర్,గండి శ్యామ్,కాసారపు కిరణ్ కుమార్,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ గ్లోబల్ సలహాదారులుగా కౌటికే విఠల్ నియామకం

ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ గ్లోబల్ సలహాదారులుగా ప్రముఖ చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ సలహాదారు, సేవా కార్యక్రమాల నిర్వాహకుడు కౌటికే విఠల్ సంస్థ గ్లోబల్ చైర్మన్ టీ.జీ. వెంకటేష్ ప్రత్యేక సమావేశంలో నియమించారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాట్లాడిన టీ.జీ. వెంకటేష్, కౌటికే విఠల్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. ఎన్నో సంవత్సరాలుగా భారతదేశంలో చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ సలహాదారులలో అగ్రస్థానంలో కొనసాగుతున్నారని తెలిపారు. తమ పాలసీదారుల జన్మదినోత్సవాల సందర్భంగా ప్రతి సంవత్సరం వెయ్యిమందికి ఉచిత అన్నదానం నిర్వహించడం, చలికాలంలో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేయడం, ఎండాకాలంలో వేలాది మందికి ఉచితంగా నీటి బాటిళ్లు అందించడం వంటి అనేక సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో విశేష గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఇలాంటి సేవాభావం, నాయకత్వ లక్షణాలు, సమాజపట్ల అంకితభావాన్ని గుర్తించి ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ గ్లోబల్ సలహాదారులుగా నియమించినట్లు తెలిపారు.

తక్షణమే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

బిరెడ్డి కరుణాకర్ రెడ్డి

కరీంనగర్,మే 07(వాయిస్ టుడే):రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్టు జీవోలు ఇచ్చి చేతులు దులుపుకోవడం కాదని వెంటనే నిధులు కేటాయించి పాలకవర్గం ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా రెడ్డి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బిరెడ్డి కరుణాకర్ రెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.రెడ్డి కార్పొరేషన్ కు నిధులు కేటాయించి పాలకవర్గం ఏర్పాటు చేయని పక్షంలో రాష్ట్రంలోని అన్ని రెడ్డి సంఘాలతో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాజకీయ కక్షలతో
నగరాన్ని రణరంగంగా మారుస్తున్నారా

నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి : సర్దార్ రవీందర్ సింగ్

కరీంనగర్‌లో గుండాయిజం, రౌడీయిజం పెరుగుతోందా..?

పోలీసులను ప్రశ్నించిన రవీందర్ సింగ్

కరీంనగర్,మే 07(వాయిస్ టుడే): నగరంలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై జరిగిన దాడి ఘటనను మాజీ మేయర్,రాష్ట్ర సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్ సింగ్ తీవ్రంగా ఖండించారు.రాజకీయ విభేదాలు ఉండొచ్చు కానీ,కార్యాలయాలపై దాడులు చేయడం,వాహనాలను ధ్వంసం చేయడం,కార్యకర్తల్లో భయాందోళనలు సృష్టించడం ప్రజాస్వామ్యానికి ముప్పని అన్నారు.ఘటన అనంతరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన రవీందర్ సింగ్,పోలీసు అధికారులతో మాట్లాడి నిందితులను వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా ఇలాంటి ఘటనలు జరగలేదు. పార్టీలు పరస్పరం విమర్శించుకున్నాయి తప్ప కార్యాలయాలపై దాడులు చేయలేదు.ఇప్పుడు కరీంనగర్‌లో గుండాయిజం,రౌడీయిజం పెరుగుతోంది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.కార్యాలయాలపై దాడులు చేసి,కార్లను ధ్వంసం చేసి,ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే పోలీసులు చూస్తూ ఊరుకుంటారా..? సాధారణ ప్రజలకు రక్షణ ఎక్కడుంది..? అంటూ పోలీసులను సూటిగా ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి హింసాత్మక రాజకీయాలకు స్థానం లేదని స్పష్టం చేశారు.ఈ ఘటనలో గాయపడిన బీఆర్ఎస్ నాయకుడు, ఉద్యమకారుడు దూలం సంపత్ ను హాస్పిటల్ లో పరామర్శించిన రవీందర్ సింగ్, ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.గాయపడిన కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని,బీఆర్ఎస్ కార్యకర్తలను దాడులతో భయపెట్టలేరని స్పష్టం చేశారు.దాడులు చేసి భయపెట్టాలనుకోవడం కొందరి భ్రమ మాత్రమే.ఉద్యమాల నుంచి వచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలు పోరాటాలకు ఎప్పుడూ వెనుకాడరు అని పేర్కొన్నారు.రాజకీయంగాఎదుర్కోలేకే కొందరు ఉద్దేశపూర్వకంగా ఉద్రిక్త పరిస్థితులు సృష్టిస్తున్నారని ఆరోపించారు.దాడికి పాల్పడిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన రవీందర్ సింగ్,చర్యలు తీసుకోకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు.ఇది కేవలం ఒక పార్టీపై దాడి కాదు ప్రజాస్వామ్యంపై దాడి.కరీంనగర్ ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొడతారు అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు,చల్ల హరిశంకర్,ఏనుగు రవీందర్ రెడ్డి పొన్నం అనిల్ గౌడ్ పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
శుక్రవారం 8 మే 2026

బీఆర్ఎస్ నాయకుల వైఖరి మార్చుకోకుంటే తీవ్ర పరిణామాలు

డిప్యూటీ మేయర్ సునీల్ రావు హెచ్చరిక

కరీంనగర్, మే 07 (వాయిస్ టుడే): బీఆర్ఎస్ పార్టీ నాయకులు తమ వైఖరి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. కరీంనగర్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులపై ఘాటు విమర్శలు గుప్పించారు. ఇటీవల జరిగిన దోపిడి ఘటన నేపథ్యంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై బీఆర్ఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలను ఖండించిన ఆయన, బాధ్యతాయుతమైన నాయకులుగా వ్యవహరించాల్సిన వారు దిగజారుడు రాజకీయాలకు పాల్పడటం సిగ్గుచేటని విమర్శించారు.

పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులకు శాంతి భద్రతలపై అవగాహన లేకపోవడం ఆశ్చర్యకరమని అన్నారు. ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే ఖండించాల్సింది పోయి, వ్యక్తిగత విమర్శలకు దిగడం తగదని సూచించారు. గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి తదితరులు బండి సంజయ్‌పై చేస్తున్న విమర్శలు వారి స్థాయిని చూపుతున్నాయని విమర్శించారు. బండి సంజయ్ మాత్రమే సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంలోని లోపాలను ఎత్తిచూపుతున్నారని పేర్కొన్నారు. రైతు సమస్యలు, వడ్ల కొనుగోలు జాప్యం, రైతు భరోసా వంటి అంశాలపై ప్రతిరోజూ ప్రశ్నిస్తున్న నాయకుడు బండి సంజయ్ అని అన్నారు. ఈ విషయాలను పక్కన పెట్టి బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు.

కరీంనగర్ అభివృద్ధిపై ప్రశ్నలు లేవనెత్తుతున్న బీఆర్ఎస్ నాయకులు తమ పదేళ్ల పాలనలో ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ సిటీ నిధులతో అభివృద్ధి సాధించినది బండి సంజయ్ అని స్పష్టం చేశారు. డ్రగ్ పరీక్షల విషయమై కూడా సవాల్ విసిరిన సునీల్ రావు, బండి సంజయ్ కుటుంబ సభ్యులతో సహా పరీక్షలకు సిద్ధమని ప్రకటించారు. అదే విధంగా కేటీఆర్ కూడా సిద్ధమా అని ప్రశ్నించారు. బండి సంజయ్‌పై ఎవరైనా చౌకబారు విమర్శలు చేస్తే తగిన రీతిలో ప్రతిస్పందిస్తామని హెచ్చరించారు. కౌశిక్ రెడ్డి తన వ్యాఖ్యలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు ఒంటెల సత్యనారాయణ రెడ్డి, సాగాని కొమురయ్య, పొన్నంమొండయ్య-లక్ష్మి, మాజీ కార్పొరేటర్ చంద్రమౌళి, బీజేపీ నాయకులు పండుగ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ వైఫల్యాలపై, కాంగ్రెస్, బీజేపీ నేతల అవినీతి, అక్రమాలపై బీఆర్ఎస్ శంఖారావం

- మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ధ్వజం

వరంగల్ (వాయిస్ టుడే) మే 07 : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (GWMC) పాలనలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు మరియు కాంగ్రెస్, బీజేపీ ప్రజాప్రతినిధుల వైఫల్యాలను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు వరంగల్ తూర్పు నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు కార్పొరేషన్ ప్రాంగణంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టాయి. ఈ కార్యక్రమం లో గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పాల్గొని, ప్రస్తుత పాలనపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

మే 6వ తేదీతో మేయర్, కార్పొరేటర్ల పదవీకాలం ముగిసిన సందర్భంగా, గడచిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలన 30 నెలల కాలంలో జరిగిన ప్రతి తప్పును ప్రశ్నిస్తామని నరేందర్ స్పష్టం చేశారు. తప్పు చేసిన ప్రజాప్రతినిధులను, అధికారులను వదిలిపెట్టే ప్రసక్తి లేదని, తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని అయన హెచ్చరించారు. కార్పొరేషన్‌లో కమీషన్ల దందా పరాకాష్టకు చేరిందని ఆయన ఆరోపించారు. "కొందరు నేతలకు 6 లక్కీ నంబర్ అయితే 6 శాతం, మరికొందరికి 9 లక్కీ నంబర్ అయితే 9 శాతం కమీషన్లు వసూలు చేస్తున్నారనీ, చివరకు బదిలీల కోసం కూడా కమీషన్లు అడుగుతున్న దౌర్భాగ్య స్థితి నెలకొంది" అని ఆయన ఎద్దేవా చేశారు. వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేయాల్సింది పోయి, మాస్టర్ ప్లాన్ పేరుతో విధ్వంసం సృష్టించారని మండిపడ్డారు. తమకు నచ్చని వారి భూములను గ్రీన్ జోన్లలో పెట్టడం, నచ్చిన వారి కోసం రోడ్ల అలైన్‌మెంట్లు మార్చడం వంటి అక్రమాలకు పాల్పడ్డారని, వీటన్నింటికీ తగిన సాక్ష్యాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. "రాష్ట్రంలోనే తొలి మేయర్‌గా తను రాష్ట్రపతి అవార్డు తీసుకున్ననని గౌరవంగా పదవి నుంచి బయటకు వచ్చాననీ అన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి ఏంటో, గత 30 నెలల్లో కాంగ్రెస్, బీజేపీలు చేసిన విధ్వంసం ఏంటో చర్చించడానికి నేను సిద్ధం. మీరు సిద్ధమా?" అని ఈ సందర్భంగా ఆయన సవాల్ విసిరారు. కేవలం మాటలతో కాకుండా, సమాచార హక్కు చట్టం (RTI) ద్వారా సేకరించిన పూర్తి పత్రాలతో, సాక్ష్యాలతో ప్రజల ముందుకు వెళ్తామని చెప్పారు. రోడ్ల కబ్జాలు, ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్ల వంటి అంశాలపై పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. "విమానం నా కోసం ఆగింది.. నా పవర్ ఏంటో చూపిస్తా" అంటూ అధికారులు, ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేస్తున్న తీరును ఆయన తప్పుబట్టారు. ప్రజలను పీల్చి తిన్న వారెవరినీ వదిలిపెట్టబోమని, త్వరలోనే అన్ని నిజాలను ప్రజల ముందు ఉంచుతామని నన్నపునేని నరేందర్ ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎనమామల మాజీ మార్కెట్ చైర్మన్ తుమికి రమేష్ బాబు బీఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్లు కుందారపు రాజేందర్,దండు దయాసాగర్, కొంతం మోహన్, సోమ రామ బాబురావు,మాజీ ఆర్టిఏ సభ్యులు గోరంట్ల మనోహర్ మాజీ కూడా డైరెక్టర్ మొడం ప్రవీణ్ , నీలం రాజు కిషోర్ మరియు వరంగల్ తూర్పు నియోజకవర్గం డివిజన్ మాజీ అధ్యక్షులు మరియు ప్రస్తుత ఇంచార్జిలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతలు మహిళా నాయకురాలు యువజన నాయకులు మరియు , కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కరీంనగర్ ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టాలని చూస్తే ఊరుకోం..

బిజెపి, బీఆర్ఎస్ నాటకాలు ప్రజలు చూస్తున్నారు

దాడులు చేసుకుంటూ ప్రజలను డైవర్ట్ చేస్తున్నారు

లా అండ్ ఆర్డర్ చేతిలోకి తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం

రేవంత్ రెడ్డిని బదనాం చేస్తే బుద్ధి చెప్తాం

సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్, మే 07(వాయిస్ టుడే): బిజెపి బీఆర్ఎస్ చీకట్లో రహస్య ఒప్పందాలు చేసుకొని ప్రజలను డైవర్ట్ చేస్తున్నారని సుడా చైర్మన్ మండిపడ్డారు.ఇటీవల జరిగిన మేయర్,కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక విషయంలో బిజెపి బీఆర్ఎస్ పరస్పరం సహకరించుకున్నాయని అన్నారు.ఒకరినొకరు తిట్టుకుంటూ పరస్పరం దాడులు చేసుకుంటూ సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలనను బదనాం చేసేలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అడ్డగోలుగా మాట్లాడితే బుద్ధి చెప్తామని,సిగ్గు లేకుండా కేటీఆర్ నోటికి ఎంత వస్తే అంత మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం మారితే కేటీఆర్ తట్టుకోలేకపోతున్నారని ప్రజాపాలనను చూసి ఓర్వలేక పోతున్నారని తాము తలుచుకుంటే కేటీఆర్ ను బయట తిరగనివ్వమని అన్నారు.పథకం ప్రకారమే బిజెపి బీఆర్ఎస్ కలిసి రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బదనాం చేసే నాటకాలు ఆడుతున్నాయని,కరీంనగర్లో ప్రశాంత వాతావరణం చెడగొడుతున్నాయని తెలిపారు. బాధ్యత గల పదవుల్లో ఉన్న నేతలంతా డ్రగ్స్ పైన జుట్టు పైన మచ్చలపైన మాట్లాడుకుంటూ పబ్బం గడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ నేతలు తలుచుకుంటే బిజెపి,బిఆరెస్ నేతలవ్యవహారాలన్నీ బయటపెడతామని అన్నారు. జువెలరీ షాప్ లో జరిగిన రాబరీ విషయంపై పోలీసులు పకడ్బందీగా దర్యాప్తు ప్రారంభించారని,కౌశిక్ రెడ్డి కోడుగుడ్డు మీద ఈకలు పీకటం మానుకోవాలని అన్నారు.పోలీస్ వ్యవస్థను కించపరిచేలా కౌశిక్ రెడ్డి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.దర్యాప్తు విషయాలను బయటకు చెప్తే దొంగలు జాగ్రత్త పడే అవకాశం ఉంది కాబట్టి విచారణ విషయాలను గోప్యత పాటిస్తున్నారని అన్నారు.దొంగలు ఎక్కడి నుంచి ఎక్కడి వరకు వచ్చింది లాడ్జిలో ఎలా దాక్కున్నది కరీంనగర్ కు ఎలా చేరుకున్నది పోలీసులు బయట పెడితేనే కదా తెలిసింది అంటూ కౌశిక్ రెడ్డిని చైర్మన్ ప్రశ్నించారు.కేటీఆర్ స్నేహితుల ఫామ్ హౌస్లలో డ్రగ్స్ దొరికాయి.ఆ మత్తులో కేటీఆర్ ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదు. వెంటనే కుటుంబ సభ్యులు ట్రీట్మెంట్ ఇప్పించాలని అన్నారు. కేటీఆర్ మాటలకు అడ్డు అదుపు లేకుండా పోతుందని,మత్తులో ఏదేదో మాట్లాడుతున్నారని,పదవి అధికారం పోయిన తరువాత అక్రోషం ఎక్కువైందని తెలిపారు.వ్యక్తిగత దూషణలకు పాల్పడుతూ డ్రగ్స్ తీసుకుని వ్యాధి ముదిరినట్లు బిహేవ్ చేస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్,కార్పొరేటర్లు మల్లెపల్లి బుచ్చిరెడ్డి,సరిల్ల ప్రసాద్,బేల భూమయ్య,గంటా శ్రీనివాస్,జగన్ రెడ్డి,పర్వతాల మల్లేశం,వారాల నర్సింగం,మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు తాజుద్దీన్,ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి,ఉప్పరి అజయ్,మాసూమ్ ఖాన్,అప్రఫ్, బషీర్,కలీల్,జమీల్,షహన్నా,ఎండీ అనిఫ్ పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసిన ముదిగొండ నాయకులు

ముదిగొండ మండలం మే 7 వాయిస్ టుడే: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కని గురువారం హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో ముదిగొండకి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముదిగొండ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతగాని నాగరాజు, తన కుమార్తెల ఓణీల శుభకార్యానికి విచ్చేయాలని కోరుతూ డిప్యూటీ సీఎంకి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ ఆహ్వానంపై ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ, శుభకార్యానికి హాజరవుతానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కందిమళ్ళ వీరబాబు (మధిర నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బీ-బ్లాక్ అధ్యక్షుడు), చెరుకుపల్లి రాంబాబు (ముదిగొండ మండల ఎస్ఎస్సిఎల్ అధ్యక్షుడు), నాయిని వీరనారాయణ (ముదిగొండ మండల నాయకులు),దొంతగాని నాగరాజు (ముదిగొండ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు)ఈ భేటీలో నియోజకవర్గ అభివృద్ధి మరియు పార్టీ బలోపేతంపై పలు అంశాలను నాయకులు చర్చించారు.

మే 8 మానవతా సేవ, రక్తవ్యాధులపై అవగాహనకు ప్రతీకగా మూడు అంతర్జాతీయ దినోత్సవాలు

-- ఇ.వి. శ్రీనివాస్ రావు
రెడ్ క్రాస్ సొసైటీ
రాష్ట్ర పాలక మండలి సభ్యులు

హైదరాబాద్, మే 8: వాయిస్ టుడే ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం మే 8న మూడు ముఖ్యమైన అంతర్జాతీయ దినోత్సవాలు నిర్వహించబడుతున్నాయి --- ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం, ప్రపంచ థలసేమియా దినం, సికిల్ సెల్ అవగాహన దినం. ఈ మూడు దినోత్సవాలు మానవతా సేవా స్ఫూర్తి, ఆరోగ్య చైతన్యం, రక్త సంబంధిత వ్యాధుల నివారణపై సమాజంలో అవగాహన పెంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ దినోత్సవాల ప్రధాన లక్ష్యం ప్రాణాలను కాపాడటం, బాధితులకు మద్దతు ఇవ్వడం, సమాజంలో సేవా భావాన్ని పెంపొందించడం.

ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం ప్రాముఖ్యత

ప్రపంచవ్యాప్తంగా మానవతా సేవలు అందిస్తున్న రెడ్ క్రాస్ మరియు రెడ్ క్రిసెంట్ సంస్థల సేవలను గౌరవించేందుకు ఈ దినాన్ని నిర్వహిస్తారు. యుద్ధాలు, ప్రకృతి విపత్తులు, ప్రమాదాల సమయంలో సేవలందించే వాలంటీర్ల కృషిని గుర్తించడమే కాకుండా, రక్తదానం, ఆరోగ్య సేవలు, సహాయక చర్యలపై ప్రజల్లో చైతన్యం కల్పించడం ఈ దినం లక్ష్యం. రెడ్ క్రాస్ ఉద్యమానికి పునాది వేసిన స్విట్జర్లాండ్‌కు చెందిన సామాజిక సేవకుడు హెన్రీ డ్యునాంట్. 1859లో జరిగిన సోల్ఫెరినో యుద్ధం సమయంలో గాయపడిన సైనికులకు సహాయం చేసిన అనుభవంతో ఆయన ఈ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఆయన జన్మదినమైన మే 8నే ఈ దినోత్సవంగా జరుపుకుంటున్నారు. 1901లో ఆయనకు తొలి నోబెల్ శాంతి బహుమతి లభించింది.

రెడ్ క్రాస్ సేవలు

రెడ్ క్రాస్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా పలు కీలక సేవలు అందిస్తోంది. రక్తదాన శిబిరాల నిర్వహణ, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందించడం, వరదలు, భూకంపాలు, తుఫానులు వంటి విపత్తుల సమయంలో సహాయక చర్యలు చేపట్టడం ఇందులో ప్రధానమైనవి. అదనంగా ఆరోగ్య శిబిరాలు, ప్రథమ చికిత్స శిక్షణ, తల్లి-శిశు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి సేవలందిస్తోంది.

ప్రపంచ థలసేమియా దినం: అవగాహన అవసరం

థలసేమియా ఒక వారసత్వ రక్త వ్యాధి. ఈ వ్యాధిలో శరీరంలో సరిపడా హీమోగ్లోబిన్ ఉత్పత్తి కావడం లేదు. దీనివల్ల రక్తహీనత, అలసట, ఎదుగుదలలో సమస్యలు, గుండె మరియు కాలేయ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. బాధితులకు తరచూ రక్త మార్పిడి అవసరం అవుతుంది. ఈ దినం ద్వారా ప్రజల్లో అవగాహన పెంచడం, ముందస్తు రక్త పరీక్షల ప్రాముఖ్యత తెలియజేయడం, బాధితులకు మద్దతు కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. వివాహానికి ముందు రక్త పరీక్షలు చేయించడం, జన్యు సలహా తీసుకోవడం ద్వారా ఈ వ్యాధిని నివారించవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

సికిల్ సెల్ అవగాహన దినం ప్రాధాన్యం

సికిల్ సెల్ అనేది జన్యుపరమైన రక్త వ్యాధి. ఇందులో ఎర్ర రక్త కణాలు గుండ్రంగా కాకుండా కొడవలి ఆకారంలో మారిపోతాయి. దీని వల్ల రక్తప్రసరణ సరిగా జరగకపోవడం, శరీరానికి ఆక్సిజన్ సరఫరా తగ్గడం, తీవ్రమైన నొప్పులు, ఇన్ఫెక్షన్లు వంటి సమస్యలు తలెత్తుతాయి. ఈ వ్యాధిపై ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో అవగాహన పెంచడం, ముందస్తు పరీక్షలు చేయించడం, సరైన వైద్యం అందించడం అత్యంత అవసరం.

యువత పాత్ర కీలకం

సమాజంలో ఆరోగ్య చైతన్యం పెంపొందించడంలో యువత పాత్ర ఎంతో ముఖ్యమైనది. రక్తదానం చేయడం, ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం, థలసేమియా మరియు సికిల్ సెల్ వ్యాధులపై అవగాహన కల్పించడం ద్వారా యువత ముందుకు రావాలి.

రక్తదాతల సేవలకు వందనాలు

స్వచ్ఛందంగా రక్తదానం చేసే ప్రతి వ్యక్తి ప్రాణరక్షకుడిగా నిలుస్తున్నారు. "ఒక్క యూనిట్ రక్తం -- అనేక ప్రాణాలకు జీవనాధారం" అనే నినాదం ఈ సందర్భంలో మరింత ప్రాధాన్యం సంతరించుకుంటుంది. థలసేమియా పిల్లలు, ప్రమాద బాధితులు, శస్త్రచికిత్స రోగులు రక్తదాతల వల్లనే కొత్త జీవితం పొందుతున్నారు.

సమాజానికి సందేశం

"మానవ సేవే మహా సేవ -- రక్తదానం మహాదానం" అనే సందేశాన్ని మే 8 మనకు గుర్తుచేస్తుంది. ఈ మూడు దినోత్సవాలు మనందరికీ ఒక బాధ్యతను గుర్తు చేస్తున్నాయి --- ప్రాణాలను కాపాడటం, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడం.

స్వచ్ఛంద రక్తదానం, అవగాహన, యువత భాగస్వామ్యం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది.

రైతులపై రాజకీయ మానుకో వారం రోజుల్లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

రొయ్యపల్లిలో రైతు సంఘం నాయకుల హెచ్చరిక

అధికారులకు ఎమ్మెల్యే మధ్య రగడ.

వాయిస్ టుడే నర్సాపూర్: నియోజకవర్గంలో హత్నూర మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరు సర్టిఫికెట్లను ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించాల్సి ఉండే కార్యక్రమానికి వివిధ గ్రామాల లబ్ధిదారులు ప్రజా ప్రతినిధులు నాయకులు హాజరయ్యారు. అంతలోనే ఎంపీడీవో శంకర్ సమావేశం వద్దకు వచ్చి చాలామంది సర్పంచులు రాలేదని లబ్ధిదారులకు సర్టిఫికెట్ల కార్యక్రమం మరొక రోజు పెట్టుకుందామని చెప్పడంతో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఆగ్రహించి రైతు వేదిక ఎదుట బయటహించి సుమారు గంట సేపు నిరసన తెలిపారు అయినా అధికారులు స్పందించక పోవడంతో అక్కడే రెండు మూడు గంటలు వేచి చూసిన ఎమ్మెల్యే మీడియా ముందు అధికారుల తీరును ప్రశ్నించారు. సమాధానం చెప్పకపోవడంతో అధికారులు ప్రజా పాలన అంటూ ప్రజలకు మంజూరైన ఇందిరమ్మ సర్టిఫికెట్లను బీఆర్ఎస్ ఎమ్మెల్యే అయినా నేను అందించడం వారికి నచ్చడం లేదా నేను నర్సాపూర్ నియోజకవర్గానికి సంబంధించిన ప్రజలకు ఎమ్మెల్యేను కాదా అని ప్రశ్నించారు.అధికారులు కాంగ్రెస్ ప్రభుత్వానికి కొమ్ముకాస్తున్నారని నిలువెత్తు నిదర్శనం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందని అన్నారు.నా చేతుల మీదుగా లబ్ధిదారులకు సర్టిఫికెట్లను ఇప్పించడం ఇష్టం లేదని ఇప్పటికైనా లబ్ధిదారులకు అధికారులైనా కాంగ్రెస్ పార్టీ సర్పంచులతో అయినా సర్టిఫికెట్లను ఇప్పించాలని అధికారులకు సూచించారు మరొక్కసారి ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే ఎంతకైనా ఎక్కడైనా భారీ ఎత్తున తమ నాయకులతో కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడుతామని ఇకనైనా అధికారుల తీరు మార్చుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు... కార్యక్రమంలో కాంగ్రెస్ బీఆర్ఎస్ నాయకుల మధ్య ఇలాంటి గొడవలు జరుగుతాయని పోలీసులు ముందస్తు సమాచారంతో పటాన్చెరు డిఎస్పి ప్రభాకర్ ఆధ్వర్యంలో జిన్నారం సీఐ రమణారెడ్డి.ఎస్సై శ్రీధర్ రెడ్డి.ల పర్యవేక్షణలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రామచంద్ర రెడ్డి బిఆర్ఎస్ జిల్లా నాయకులు వీరేశం గౌడ్ మాజీ ఎంపీపీ నర్సింలు వివిధ గ్రామాల సర్పంచులు మాజీ సర్పంచ్లు నాయకులు పాల్గొన్నారు.

మున్నూరు కాపుల కుటుంబ సర్వే పోస్టర్ ఆవిష్కరణ

ఐక్యత, అభివృద్ధి లక్ష్యంగా డిజిటల్ యాప్ రూపకల్పన

చొప్పదండి ..మే07 :వాయిస్ టుడే మున్నూరు కాపు సమాజం ఐక్యత, అభివృద్ధి లక్ష్యంగా తెలంగాణ మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కొత్త లక్ష్మణ్ పటేల్ ఆధ్వర్యంలో రూపొందించిన డిజిటల్ యాప్ కుటుంబ సర్వే పోస్టర్‌ను చొప్పదండి నియోజకవర్గ ఇంచార్జ్ మడ్లపల్లి శ్రీనివాస్ పటేల్, చొప్పదండి మున్సిపాలిటీ కౌన్సిలర్ కొట్టే అశోక్, మండల అధ్యక్ష కార్యదర్శులు మల్యాల మహేందర్, అమీర్ శెట్టి వెంకటేష్, మాజీ అధ్యక్షులు గాండ్ల లక్ష్మణ్, మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం జిల్లా అధ్యక్షులు వెల్పుల శ్రీనివాస్ పటేల్ చొప్పదండిలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలోని విద్యావంతులు, వైద్యులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలను ఒకే వేదికపైకి చేర్చి, పరస్పరం సహకరించుకునేలా ఈ యాప్‌ను తీర్చిదిద్దినట్లు తెలిపారు. ముఖ్యంగా యువతకు విద్య, ఉపాధి, వ్యాపార రంగాల్లో మార్గదర్శకత్వం అందించడానికి, అత్యవసర సమయాల్లో తోడ్పాటునందించుకోవడానికి ఈ డిజిటల్ వేదిక కీలకం కానుందని పేర్కొన్నారు. దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ యాప్‌ను ప్రారంభించనున్నామని, పైలెట్ ప్రాజెక్టుగా కరీంనగర్ జిల్లాను ఎంచుకున్నట్లు వెల్లడించారు. జిల్లాలో మొదటిగా చొప్పదండిలో కార్యక్రమం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన మున్నూరు కాపు జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

మూగ జీవాల స్మగ్లర్ల అరెస్టులో ప్రతిభ కనబరిచిన ఖానాపూర్ ఎస్సైకి పురస్కారం

నర్సంపేట/ వాయిస్ టుడే, మే 07: మూగ జీవాల అక్రమ పాల్పడుతున్న ముఠాకు చెందిన నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కన బరిచిన ఖానాపూర్ ఎస్.ఐ జి.రామ్మోహన్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అభినందిస్తూ గురు వారం సీపీ కార్యాలయంలో ఎస్. ఐ రాంమోహన్ కు నగదు రివార్డ్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ పాల్గొన్నారు.

కేసీఆర్ ప్రభుత్వం రైతుకు భరోసా.. కాంగ్రెస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ దందా

కేసీఆర్ పాలనలో ఆస్తులు సృష్టి..కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పులు

రైతు సంగ్రామ సదస్సుకు స్వచ్ఛందంగా హాజరైన రైతులు

కాంగ్రెస్ పాలనలో నిర్మాణం కంటే విధ్వంసమే ఎక్కువ

కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యేలు
ఆరూరి రమేష్, డాక్టర్ రాజయ్య తీవ్ర విమర్శలు

హనుమకొండ,వాయిస్ టుడే: కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణలో వ్యవసాయానికి పెద్దపీట వేసి రైతులకు భరోసా కల్పించిందని.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ దందా పెరిగిందని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ఆరోపించారు. గురువారం హనుమకొండ జిల్లా భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం నిర్వహించిన రైతు సంగ్రామ సదస్సుకు రైతులు స్వచ్ఛందంగా భారీగా తరలివచ్చారని తెలిపారు. సదస్సును విస్తృతంగా ప్రచారం చేసిన మీడియాకు ధన్యవాదాలు తెలిపారు. 2022 మే 6న కాంగ్రెస్ ప్రకటించిన రైతు డిక్లరేషన్‌ను రెండున్నరేళ్లు అయిన అమలు చేయలేదని విమర్శించారు. ఇచ్చిన హామీల అమలుపై మాత్రమే కేటీఆర్ ప్రశ్నించారని పేర్కొన్నారు. ప్రశ్నిస్తే కాంగ్రెస్ నేతలు ఉలిక్కిపడుతున్నారని విమర్శించారు. రైతు సమస్యలపై మాట్లాడితే కేసులు పెడతారా అంటూ ప్రశ్నించారు. రైతు బంధు వంటి పథకాలను కేసీఆర్ ప్రభుత్వం రైతులు అడగకుండానే అమలు చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు,నాయకులు స్థాయిమించి మాట్లాడుతున్నారని హెచ్చరిస్తూ రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. మామునూరు ఎయిర్‌పోర్టు,నయీంనగర్ నాలా బ్రిడ్జి,కాళోజీ కళాక్షేత్రం,రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వంటి అభివృద్ధి కార్యక్రమాలను బీఆర్ఎస్ సాధించిందని పేర్కొన్నారు. అనంతరం మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో నిర్మాణం కంటే విధ్వంసమే ఎక్కువగా కనిపిస్తోందన్నారు. రైతు బంధు వంటి పథకం దేశంలో ఎక్కడా లేదని వ్యవసాయాన్ని పండుగలా మార్చింది కేసీఆర్ ప్రభుత్వమేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా కూల్చివేతల పాలన కొనసాగిస్తోందని విమర్శించారు. మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతు సంగ్రామ సదస్సు విజయవంతం కావడంతో కాంగ్రెస్ నేతలు అసహనానికి గురవుతున్నారని అన్నారు. రైతులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. 10ఏళ్ల కేసీఆర్ పాలనలో ఆస్తులు సృష్టించామని,కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులు మాత్రమే చేసిందని ఆరోపించారు. ఈ సమావేశంలో మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవ్ రెడ్డి,మాజీ కార్పొరేటర్లు ఉడతల సారంగపాణి,చింతల యాదగిరి,జక్కుల శ్రీనివాస్ యాదవ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష

మహబూబ్నగర్ జిల్లా (ప్రతినిధి) మే 7 (వాయిస్ టుడే): జడ్చర్ల నియోజకవర్గం మిడ్జిల్ మండల్ మహబూబ్ జిల్లా స్పెషల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి తమన్ రాజరాజేశ్వరి గురువారం మిడ్జిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2020 సంవత్సరంలో నమోదైన పోక్సో కేసులో నిందితుడైన కుర్రావత్ రమేష్ (25), మిడ్జిల్ మండలానికి చెందిన వ్యక్తిపై నేరం రుజువుకావడంతో 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

2020 నవంబర్ 22వ తేదీన బాధిత బాలికపై నిందితుడు అఘాయిత్యానికి పాల్పడిన ఘటనపై మిడ్జిల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయబడింది. అప్పటి ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేయగా, అప్పటి జడ్చర్ల రూరల్ సీఐ శివకుమార్ దర్యాప్తు నిర్వహించి నిందితుడిపై చార్జ్ షీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.జాన్ కోర్టులో 15 మంది సాక్షులను ప్రవేశపెట్టి బలమైన వాదనలు వినిపించారు. మిడ్జిల్ ఎస్‌హెచ్‌ఓ పర్యవేక్షణలో సీడీఓలు రమేష్, పిసి 3229 మరియు శంకర్, పిసి 2194, అలాగే కోర్టు లైజనింగ్ ఏఎస్ఐ బాలకృష్ణ సాక్షులను క్రమపద్ధతిలో కోర్టులో ప్రవేశపెట్టి కేసు విచారణ సాఫీగా జరిగేలా కృషి చేయడంతో కోర్టు నిందితుడికి శిక్ష విధించింది. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేందుకు సమర్థవంతంగా పనిచేసిన పోలీసు అధికారులు, ప్రజా అభియోజకులను జిల్లా ఎస్పీ డి.జానకి, అభినందించారు.

గ్రామ ఆడబిడ్డ పెళ్లికి అండగా సిద్ధాపూర్ సర్పంచ్

పేద కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన మహమ్మద్ షరీఫ్

ఝరాసంగం మే 07 (వాయిస్ టుడే) : ఝరాసంగం మండలంలోని సిద్ధాపూర్ గ్రామంలో ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలోనూ, గ్రామ బిడ్డల శుభకార్యాలకు అండగా నిలవడంలోనూ సిద్ధాపూర్ గ్రామ సర్పంచ్ మహమ్మద్ షరీఫ్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. సిద్ధాపూర్. గ్రామానికి చెందిన జలీల్ మియా కుమార్తె వివాహానికి సాయంగా సర్పంచ్ మహమ్మద్ షరీఫ్ తన వంతు ఆర్థిక సహాయంగా రూ. 21,000 అందజేశారు. గ్రామ ఆడబిడ్డ పెళ్లికి అండగా నిలిచిన సర్పంచ్‌కు జలీల్ మియా కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చిల్లెపల్లి సర్పంచ్ మల్ రెడ్డి, హఫీజ్, కె. సంగారెడ్డి, చాంద్ పాషా, యూసుఫ్, లాలప్ప, ఫయాజ్, ఆరిఫ్, అలీమ్, బాబు మరియు గ్రామస్థులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భార్య అదృశ్యం భర్త పోలీసులకు ఫిర్యాదు

నవాబుపేట్, మే 7 (వాయిస్ టుడే): మహిళ అదృశ్యమైన సంఘటన నవాబుపేట్ మండల కేంద్రంలో జరిగింది.ఎస్సై విక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన అనగొంది వెంకటయ్య(50)అనే వ్యక్తి యొక్క మొదటి భార్య చనిపోయినందున గత 14సంవత్సరాల క్రితం అనగొంది ప్రమీల(33)ను రెండవ వివాహం చేసుకున్నాడు.భార్యాభర్తలు ఇద్దరు ప్లాస్టిక్ వ్యాపారం నిర్వహిస్తుండేవారు.భార్యాభర్తల వ్యాపారానికి వెంకటయ్య సొంత అన్న కుమారుడైన సైదులు అనే వ్యక్తి సహాయం చేస్తుండేవాడు,కాగా గత నెల 8వ తేదీన వెంకటయ్య భార్య ప్రమీల తన అన్న కుమారుడు సైదులు వ్యాపార నిమిత్తం ఇంటి నుంచి వెళ్లి ఇప్పటివరకు తిరిగి రాలేదు.దీంతో వెంకటయ్య చుట్టుపక్కల వారిని,తెలిసిన బంధువులను అడిగిన ప్రమీల సైదులుల ఆచూకీ లభించనందున గురువారం వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.

హనుమకొండ రెడ్ క్రాస్‌లో ప్రత్యేక సభ్యత్వ నమోదు

ప్రారంభించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

హనుమకొండ,వాయిస్ టుడే: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆదేశానుసారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ జిల్లా పరిధిలో ప్రత్యేక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్ పాయ్ చేతుల మీదుగా గైరువారం ప్రారంభించారు. అనంతరం రెడ్ క్రాస్ పరిపాలన భవనంలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజ సేవలో భాగస్వామ్యం కావాలనుకునే వారు రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వం పొందవచ్చు అని తెలిపారు. సభ్యత్వం పొందదలచిన వారు సభ్యత్వ దరఖాస్తు ఫారం పూర్తి చేసి రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు,స్థానిక ఆధార్ కార్డ్ ప్రతితో పాటు శాశ్వత సభ్యత్వ ఫీజు 1,150 రూపాయలు చెల్లించాలన్నారు. సమర్పించిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం సభ్యత్వ ప్రక్రియ పూర్తి చేసి శాశ్వత సభ్యత్వం మంజూరు చేయబడుతుంది అని తెలిపారు.

అనంతరం పాలకవర్గ సమావేశంలో రెడ్ క్రాస్ ఆదాయం,వ్యయాలను సమీక్షించి పాలకవర్గ సభ్యులతో చర్చించారు. రక్తదాన కార్యక్రమమే కాకుండా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రెడ్ క్రాస్ పాలకవర్గం అభినందనీయమైన సేవలు అందిస్తున్నదని కలెక్టర్ ప్రశంసించారు. రెడ్ క్రాస్ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ చైర్మన్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సభ్యత్వం గురించి మరియు రెడ్ క్రాస్ సేవాకార్యక్రమాలు గురించి వివరించారు. అనంతరం రెడ్ క్రాస్ పాలకవర్గం కలెక్టర్ కు పూల మొక్క అందించి శాలువా తో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి.విజయచందర్ రెడ్డి,కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి,రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈ.వి శ్రీనివాస్ రావు,జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణు గోపాల్,పొట్లపల్లి శ్రీనివాస్ రావు,డాక్టర్ హెచ్.సంధ్యారాణి, బిళ్ళ రమణ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు భద్రతే లక్ష్యంగా పోలీసుల ఉక్కుపాదం

-పోచమ్మమైదాన్, పోస్టాఫీస్ కూడళ్లలో ముమ్మర తనిఖీలు..

-మైనర్ డ్రైవింగ్, లైసెన్స్ లేని వారిపై జరిమానాల మోత

వరంగల్ (వాయిస్ టుడే) మే 07: వరంగల్ నగరంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోచమ్మమైదాన్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ,వరంగల్ ట్రాఫిక్ విభాగం సర్కిల్ ఇన్స్పెక్టర్ కోడూరి సుజాత ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని పట్టుకునేందుకు డ్రంకెన్ డ్రైవ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కట్టుదిట్టంగా నిర్వహించారు. అదే సమయంలో వారి సిబ్బంది పోస్టాఫీస్ జంక్షన్ తో పాటు పలు ముఖ్యమైన కూడళ్లలో విస్తృతంగా అడుగడుగునా తనిఖీలు జరిపాయి. ముఖ్యంగా ప్రాణాలకు ముప్పు తెచ్చే మైనర్ డ్రైవింగ్ కు పాల్పడుతున్న యువతను, కనీస బాధ్యత లేకుండా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా రోడ్లెక్కిన వాహనదారులను గుర్తించి భారీగా జరిమానాలు విధించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే ఏమాత్రం ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించే వారి పట్ల ఎంత కఠినంగా ఉంటామో స్పష్టం చేస్తూ, యువతరం భద్రతతో పాటు సామాన్య ప్రజల ప్రాణరక్షణే తమ ప్రథమ కర్తవ్యమని వరంగల్ ట్రాఫిక్ సీఐ కోడూరి సుజాత అన్నారు .

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**